RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 106 పేజీలు - 08 శనివారం 14 మార్చి 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## అసెంబ్లీ ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేయండి

- అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు




## ఎపి హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణం

- ప్రమాణ స్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్






## దేశంలో గ్యాస్ కొరత లేదు

- ప్యానిక్ బుకింగ్స్ అవసరం లేదు: కేంద్రప్రభుత్వం స్పష్టీకరణ

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మార్చి 13:** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎల్‌పీజీ కొరత ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎలాంటి భయాందోళనలు వద్దని, 'ప్యానిక్ బుకింగ్' అవసరం లేదని తెలిపింది. సంక్షోభం లేదని వివరించింది. గృహావసరాల కోసం ఎలాంటి అంతరాయం లేకుండా పైపుల ద్వారా సహజ వాయివు , కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ సరఫరాకు భరోసా ఇచ్చింది. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఆసుపత్రులు, హాస్టల్స్‌కు ఎల్‌పీజీ సరఫరాకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్టు మిగతా2లో...

# మూసీ అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నాం

20 టీఎంసిల గోదావరి జలాలు తరలిస్తాం

అద్భుత నగరాన్ని కాపాడుకునే బాధ్యత మనది

ఎవరు సూచనలు ఇచ్చినా తీసుకునేందుకు సిద్ధం

వరదలు వస్తే ప్రజలు నిరాశ్రయులు అవుతున్నారు


నదులను ఆక్రమించుకోవడం వల్లనే వరదలు

మూసీ ప్రాజెక్టును విమర్శిస్తున్న వారు అక్కడ ఉండగలరా?

మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి




**తొలి అక్షరం/హైదరాబాద్,మార్చి 13:** మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విదేశాల్లో పలు నదులను సందర్శించి అధ్యయనం చేశారని, ఇప్పటికీ బృహత్కార్యాచరణ చేపట్టకపోతే భవిష్యత్ తరాలు క్షమించవన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా నిపుణులు, అధికారులతో క్షుణ్ణంగా ప్రతి అంశం పరిశీలించామని చెప్పారు. నిజాంలు, బ్రిటీషర్లు సికింద్రాబాద్ నగరాన్ని నిర్మించారు. ఈసీ, మూసీ వరదల నియంత్రణకు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తి తీరుస్తున్నాయి. ప్రపంచ పరిణామాలు, పర్యావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలి. అపార మేధో సంపత్తి మిగతా2లో...



## నేటినుంచి తెలంగాణ పదో తరగతి పరీక్షలు

- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం
- సకాలంలో సెంటర్‌కు చేరుకోవాలన్న అధికారులు

**తొలి అక్షరం/హైదరాబాద్,మార్చి 13:** తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ భారీగా ఏర్పాట్లు చేసింది. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. హాల్ టిక్కెట్ చూపిస్తే దిగాల్సిన చోటు వరకు ఉచితంగా ప్రయాణం కల్పిస్తారు. ఇకపోతే పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని అధికారులు సూచించారు. ఐదు నిముషాల ఆలస్యాన్ని పరి గణనలోకి తీసుకుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా మిగతా2లో...

## అసోంలో రూ.4,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మోడీ

కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం



**తొలి అక్షరం/గువాహటి,మార్చి 13 :** అస్సాం అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ఆ రాష్ట్రంలో పర్యటించారు. రూ.4,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం కోకరార్ఝార్‌లోని బహిరంగ సభలో మోదీ ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ వాతావరణ ప్రతికూలత కారణంగా వేదిక మిగతా2లో...

## మూసీ ప్రక్షాళలను ఎప్పుడూ వ్యతిరేకించలే...

● ఇళ్లను కూలగొట్టడంపైనే మా అభ్యంతరం ● మూసీ నీటితో రైతులకు మేలు జరిగితే స్వాగతిస్తాం ● మూసీకి ముందు సబర్మతిపై అధ్యయనం చేయండి ● పదేపదే బిజెపిని విమర్శించడం అపండి ● తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు



**తొలి అక్షరం/హైదరాబాద్,మార్చి 13 :** మూసీ ప్రాజెక్ట్‌పై బీజేపీకి వ్యతిరేకత లేదని.. కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా రాంచందర్ రావు శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడారు. మూసీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మూసీ నది పునరుజ్జీవనానికి కానీ.. మూసీ ప్రాజెక్ట్‌ను కానీ బీజేపీ ఎప్పుడూ వ్యతిరే కించలేదని తెలిపారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశు భ్రంగా ఉండా లని.., అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహి ంచాలని.. ఆ నీరు రైతులకు మిగతా2లో...

## శ్రీశైలం వెళ్లిన గవర్నర్ శుక్లా

- మన్ననూరులో స్వాగతం పలికిన కలెక్టర్



**తొలి అక్షరం/నాగర్ కర్నూల్,మార్చి 13 :** రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు నాగర్‌కర్నూల్ జిల్లా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. గవర్నర్ కుటుంబ సమేతం గా కలిసి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మ వార్లను దర్శించు కునేందుకు హైదరాబాద్ నుంచి నేరుగా రోడ్డు మార్గాన శ్రీశైలం దర్శనానికి వెళ్తూ మార్గమధ్యంలో నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూర్ మిగతా2లో...

## ఇంధన, గ్యాస్ కొరతపై ప్రభుత్వం సమీక్ష

కేంద్రం మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు


అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చిన మంత్రి ఉత్తమ్

మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం కోసం కమిటీలు



**తొలి అక్షరం/హైదరాబాద్,మార్చి 13 :** దేశవ్యాప్తంగా నెలకొన్న ఇంధన, గ్యాస్ సరఫరా పరిణామాలపై తెలంగాణ ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. అత్యవసర సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరా అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని గుర్తు చేస్తూ.. ప్రస్తుత పరిస్థితులపై మంత్రి ఉత్తమ్ పలు కీలక వివరాలను వెల్లడించారు. మార్కెట్‌లో కొంత మేర గ్యాస్ కొరత ఉందని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ప్రకటించిందని, దానికి అనుగుణంగా రాష్ట్రాలకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసిందని మంత్రి మిగతా2లో...

## తిరుమల లడ్డూపై పిటిషన్ కొట్టివేత



**తొలి అక్షరం/న్యూఢిల్లీ, 13 :** తిరుమల లడ్డూ వ్యవహారంలో దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఈ వ్యవహారంపై కామెంట్లు చేయకుండా నిలువరించాలని మానూరు శ్రీనివాస్ పిటిషన్ వేశారు. ఈ కామెంట్లపై సీబీఐ మిగతా2లో...

# అసెంబ్లీ ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేయండి

**తొలి అక్షరం/హైదరాబాద్,మార్చి 13:** ఈనెల 16 వ తేదీ నుండి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నందున ఇప్పటి వరకు వచ్చిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు వెంటనే సమర్పించాలని అన్ని విభాగాల ఉన్నతాధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు ఆదేశించారు. సెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో పెండింగులో ఉన్న ప్రశ్నలకు రావాల్సిన సమాధానాలు, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, శాసన మండలి, శాసనసభ సమావేశాల నేపథ్యంలో గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికీ రేపటిలోగా సమాధానాలు పంపించాలని అన్నారు. ప్రధానంగా, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ పరిపాలన, ఇంధనశాఖ, రెవిన్యూ తదితర శాఖలకు సంబంధించి అధికంగా ప్రశ్నలున్నాయని, వీటన్నింటికీ వెంటనే సమాధానాలు పంపాలని అన్నారు. బ్జడెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగం తో ప్రారంభమవుతాయన్నారు. బ్జడెట్ సమావేశాల నిర్వహణపై ఉప ముఖ్యమంత్రి ఆదివారం నాడు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మూసీ అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఉందని చెప్పేవారు ప్రాజెక్టులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏమైనా తప్పులు చేస్తే సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాం అని బిఆర్ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. మూసీ, ఈసీ సంగమ స్థానం లంగర్ హౌస్ వద్ద బాపూ ఘాట్‌ను పర్యాటక కేంద్రం చేస్తాం అన్నారు. కృష్ణా, గోదావరి జలాలతో ప్రజల దాహార్తి తీర్చాలని ప్రయత్నించాం. గోదావరి జలాలు 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టామని అన్నారు. మూసీలో నిరంతరం 2.5 టీఎంసీల గోదావరి జలాలు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నాం. మిగతా 17.5 టీఎంసీల గోదావరి జలాలతో హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చేయత్నం చేస్తున్నాం. ఎంతో ఘనమైన మూసీ చరిత్ర కాలగర్భంలో కలిసిపోతోంది. రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా అని ప్రశ్నించారు. మేం చేపడుతున్న ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదు. పాతబస్తీలో మెట్రో, రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అభివృద్ధి పనుల కోసం రూ. వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం అని వివరించారు. హైదరాబాద్ నగరంలోని చెరువులను పునరుద్ధరిస్తున్నాం. అందుకు ప్రజలు మాకు ఘన స్వాగతం పలుకుతున్నారు. మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నవాళ్లు.. మూసీ పక్కన నివసిస్తారా? అలాంటి వాళ్లకు కంటెయినర్ హౌస్‌లు ఇస్తా.. అక్కడ నివసిస్తారా? మూసీకి వరదలొస్తే వేలాదిమంది నిరాశ్రయులవుతున్నారు. నీళ్లు ప్రవహించే ప్రాంతాలను మనం ఆక్రమించుకోవడం వల్లే వరదలొస్తున్నాయి. మూసీ ప్రక్షాళన చేయకపోతే నల్గొండ ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. భవిష్యత్ తరాలకు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. వారి బాధల్ని కూడా పరిగణలోకి తీసుకొని ప్రాజెక్టుపై ముందుకు వెళ్తున్నాం. దీనికి అందరి సహకారం కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు. మూసీ ప్రాజెక్టుపై కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మరికొందరు అసంపూర్తి సమాచారంతో తప్పుడు ప్రచారం చేశారన్నారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఇతర దేశాలు వేగంగా అభివృద్ధి వైపు పయనిస్తున్నాయని తెలిపారు. మనం కూడా అభివృద్ధి వైపు పయనించాలనే మూసీ పునరుజ్జీవం చేస్తున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని స్పష్టం చేశారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలలో తాను పర్యటించానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోనే ఆర్థిక వ్యవస్థ విరాజిల్లిందన్నారు. గొప్ప నగరం హైదరాబాద్‌ను నిజాం రాజులు మనకు అందించారని తెలిపారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని చెప్పారు. మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. తమకు పొలిటికల్ డిఫరెన్స్ ఉండొచ్చు.. కానీ పొలిటికల్ పెరాలసిస్ లేదని కుండబద్దలు కొట్టారు. మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వ్యతిరేకించడం కాదు.. ఎలా చేద్దామో సలహా ఇవ్వండంటూ ఆయా పార్టీల అధినేతలు, అగ్రనేతలకు సీఎం రేవంత్ సూచించారు. మీ సలహాలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూ అభివృద్ధి జరగొద్దా? అని ఆయా పార్టీల నేతలకు సీఎం రేవంత్ ఈ సందర్భంగా చురకలంటించారు. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టుల్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. పాలసీలు, వర్కింగ్ స్టైల్ మార్చుకున్నామని చెప్పారు. కొద్దిమంది ముఖ్యమంత్రులే ప్రజలకు గుర్తున్నారని పేర్కొన్నారు. వారు వేసిన పునాదులే అలా గుర్తుంచుకునేలా చేశాయని చెప్పారు. ఎంతసేపు రంగారెడ్డి జిల్లా గురించే ఆలోచిస్తున్నారన్నారు. నల్గొండ జిల్లా గురించి ఎవరైనా ఆలోచిస్తున్నారా? అని ప్రశ్నించారు.

# నేటినుంచి తెలంగాణ పదో తరగతి పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 5,17,727మంది రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన 10,512మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి ప్రైవేటు పాఠశాల నుంచి అత్యధికంగా 2,50,015 విద్యార్థులుండగా, ప్రభుత్వ బడుల నుంచి 2,07,573 మంది, సంక్షేమ గురుకులాల నుంచి 60,139 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,582 ప్రభుత్వ, 1,094 ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే అన్ని పాఠశాలకు పంపించామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పాఠశాల గుర్తింపు తెలియకుండా సాధారణ దుస్తుల్లోనే విద్యార్థులు పరీక్షకు రావాలని కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30వరకు ఉంటాయి. పదవ తరగతి పరీక్షల సమయం సమీపిస్తున్న కొద్ది విద్యార్థుల్లో ఒత్తిడి మొదలవుతుంది. ఒత్తిడిని జయించడానికి విద్యార్థులు ఏకాగ్రతతో ప్రణాళికబద్ధంగా చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని నిపుణులు సూచిస్తున్నారు. ఇతర ఆలోచనలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్, టీవీ వైపు మనస్సు మరలకుండా చూసుకోవాలి. ప్రతిరోజూ విద్యార్థి ఏర్పాటు చేసుకున్న టైం టేబుల్ ప్రకారం చదువుకోవాల్సి ఉంటుంది. సందేహాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి. అందుకోసం తరగతి ఉపాధ్యాయులు లేదా, మంచి స్నేహితులు, సీనియర్ల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవాలి. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇంట్లో చక్కటి వాతావరణం కల్పించాలి. విద్యార్థిలో ఆత్మ విశ్వాసం పెంపొందించేందుకు ప్రతిక్షణం కృషి చేయాలి. అవసరమైన ధైర్యం అందివ్వాలి. పిల్లలు ఎక్కువ సమయం చదువుకే కేటాయిస్తారు కనుక వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. సమయానుకూలంగా విద్యార్థికి తగిన పౌష్టికాహారం అందించే ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. సమయానికి తగినంత నిద్రపోయేలా కూడా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేశాం. ఇప్పటికే రెండు ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహించి విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పించాం. గణితం, సైన్స్, ఇంగ్లిష్ స్జబెక్టులలో మంచి మార్కులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మార్చి 14 వ తేదీ నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలను నిర్వహిస్తున్నాం అని అధికారులు వివరించారు.

# మూసీ ప్రక్షాళలను ఎప్పుడూ వ్యతిరేకించలే...

(మొదటి పేజీ తరువాయి)

సాగునీటి కోసం ఉపయోగపడాలని తమ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కానీ, మంత్రి పొన్నం ప్రభాకర్ కానీ.. బీజేపీపై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కానీ మూసీ విషయంలో బీజేపీ వైఖరి మొదటి నుంచీ ఒకటేనని గుర్తు చేశారు. మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలని తమ పార్టీ ఇప్పటికీ చెబుతుందన్నారు. కానీ 'గాంధీ సరోవర్' పేరుతో అక్కడ నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదన్నారన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆ ఇళ్లను కూల్చకుండానే మూసీని శుద్ధి చేయవచ్చునన్నారు. సబర్మతి నదిని ఉదాహరణగా తీసుకునే వారు.ముందుగా అసలు అక్కడ ప్రాజెక్టు ఎలా ఏర్పాటు చేశారో తెలుసుకోవాలంటూ కీలక సూచన చేశారు. ఒకప్పుడు సబర్మతి సైతం మూసీలా కాలుష్యంతో, దుర్వాసనతో ఉండేదని గుర్తుచేశారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. నర్మదా నది నుంచి నీటిని సబర్మతికి మళ్లించి, నదుల అనుసంధానం చేయడం ద్వారా ఆ నదిని శుభ్రపరిచారని చెప్పారు. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలను ముందుగా పునరావాసం కల్పించి.. ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు చేపట్టారని గుర్తు చేశారు. సుమారు 4 వేల కుటుంబాలకు ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రజల జీవితం దెబ్బతినకుండా జరిగేదే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లు కూల్చడం అన్యాయమన్నారు. గాంధీ సరోవర్ కోసం భూమి అవసరమైతే ప్రాజెక్టును రియలైన్ చేసుకోవచ్చని సూచించారు. ఒక్క ఇల్లు కూడా దెబ్బతినకుండా ప్రణాళిక రూపొందించాలన్నారు. గాంధీ విగ్రహం నిర్మించాలనుకుంటే వెయ్యి అడుగులైనా, రెండువేల అడుగులైనా ఆకాశాన్ని తాకేలా నిర్మించొచ్చని, దానికి బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. కానీ పేదల ఇళ్లు కూల్చి వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం బీజేపీ తప్పకుండా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ముందుగా మూసీని శుద్ధిచేసి, ఆ తర్వాత అభివృద్ధి పనులు చేపట్టాలని, దానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. దేశంలో గ్యాస్, ఆయిల్, డీజిల్, పెట్రోల్ దొరకవని ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని అన్నారు. రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో యుద్దాలు, ఉద్రిక్తతలు ఉన్నప్పుడు వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంపైనా కనిపించవచ్చని, కానీ అదే పేరుతో దేశంలో కొరత వస్తుందని భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్, ప్రధాని నరేంద్ర మోదీ.. సంబంధిత దేశాల నాయకులతో మాట్లాడి, భారతదేశానికి రావాల్సిన చమురు, గ్యాస్ సరఫరా హోర్ముజ్ జలసంధి ద్వారా అంతరాయం లేకుండా దేశానికి చేరేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. భారతదేశం ఒకే ప్రాంతంపై ఆధారపడదని, దాదాపు 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచీ వస్తోందని చెప్పారు. అందువల్ల దేశంలో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ కొరత ఉండదన్నారు. యుద్ధ పరిస్థితుల వల్ల రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని.. కానీ ఇంధన కొరత మాత్రం ఉండదని స్పష్టం చేశారు. ప్రపంచంలో ఎలాంటి పరిస్థితులు వచ్చినా భారత ప్రజలు వాటిని ఎదుర్కొనే శక్తి కలిగిన వారని చెప్పారు. అలాంటి సమయంలో నాయకులు.. ప్రజల్లో ధైర్యం నింపాల్సిందే తప్ప, భయాందోళనలు కలిగించడం పెద్ద తప్పు అని పేర్కొన్నారు. దేశంలో గృహ వినియోగ ఎల్పీజీ, గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత ఉండదని ప్రధాని ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తు చేశారు. సాధారణ ప్రజలకు ఇంధన సరఫరా నిరంతరం కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వం సైతం హామీ ఇచ్చిందన్నారు. అందువల్ల వాస్తవాలు తెలుసుకోకుండా ప్రజల్లో భయాందోళనలు కలిగించే వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ రాంచందర్ రావు తెలిపారు.

# ఎపి హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణం

**తొలి అక్షరం/అమరావతి,మార్చి 13:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ఆవరణలో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణం చేయించారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు పంజాబ్, హరియాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు నుంచి జస్టిస్ లిసా గిల్ ఏపీ హైకోర్టుకు బదిలీపై వచ్చారు. కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వుల మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఏపీ హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో రెండో స్థానంలో కొనసాగుతారు. హైకోర్టు సీజె జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లిసా గిల్ సీజేగా నియమితులు కానున్నారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయ మూర్తిగా ఆమె చరిత్ర పుటలకెక్కనున్నారు. హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్ జనరల్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు సీనియర్ న్యాయవాదులు తదితరులు హాజరయ్యారు. ఏపీ హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉండగా.. ప్రస్తుతం 33 మంది ఉన్నారు. జస్టిస్ లిసా గిల్ రాకతో ఈ సంఖ్య 34కు పెరిగింది. ప్రస్తుత సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఈ ఏడాది ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ తర్వాత ఆమె సీజేగా నియమితులు కానున్నారు. ఏపీ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రికార్డ్ సృష్టించనున్నారు.

# దేశంలో గ్యాస్ కొరత లేదు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. మార్చి 2026తో పోల్చుకుంటే దేశంలో ఎల్‌పీజీ ఉత్పత్తి 40 శాతం పెరిగిందని, అదనంగా రాష్ట్రాలకు 48,000 కిలోలీటర్ల (సుమారు 48 మిలియన్ లీటర్లు) కిరోసిన్ పంపిణీ చేశామని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లకు బొగ్గు సరఫరా చేయాలని కోల్ ఇండియాను ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. మధ్యప్రాచ్యంలో యుద్దానికి ముందు యావరేజ్‌గా 55.7 లక్షల బుకింగ్‌లు ఉంటే మార్చి 12 నాటికి అది 75.7 లక్షలకు పెరిగిందని, భయాల కారణంగానే బుకింగ్‌లు అనూహ్యంగా పెరిగాయని సుజాతా శర్మ తెలిపారు. ఎల్పీజీపై ఒత్తిడి తగ్గేందుకు పీఎన్‌జీ కనెక్షన్లకు మళ్లాలని ప్రజలను కోరారు. క్రూడాయిల్‌కు సంబంధించి 258 మిలియన్ మెట్రిక్ టన్నుల కెపాసిటీ మనకు ఉందని, పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని కలిగి ఉన్నామని వివరించారు. ప్రధానమైన అర్బన్ సిటీలు, కేంద్రాల్లో కమర్షియల్ వినియోగదారుల ఆందోళన, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కమర్షియల్ వినియోగదారులు స్థానిక సీజీడీ (సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్) నెట్‌వర్క్ ప్రొవైడర్‌ను కానీ, సంబంధిత డీలర్‌ను కానీ సంప్రదించి పీఎన్‌జీ కనెక్షన్ పొందవచ్చని సూచించారు. దేశంలోని అన్ని పెట్రోల్ పంపుల్లో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, బంక్‌లు ఖాళీ అయినట్టు 25,000 డిస్ట్రిబ్యూటర్లలో ఏ ఒక్కరి నుంచీ తమకు సమాచారం లేదని సుజాతా శర్మ తెలిపారు. వదంతులను విశ్వసించవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అసోంలో రూ.4,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

వద్దకు చేరుకోలేకపోయారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అస్సాం అభివృద్ధికి రూ.4,500 కోట్లతో పలు పనులు ప్రారంభించామని, ఇందులో రూ.1,100 కోట్లు బోడోలాండ్ ప్రాంతంలోని రోడ్ల కోసం ఖర్చు చేయనున్నామని చెప్పారు. అస్సాం మేళా ఇనీషియేటివ్ మూడో దశలో అస్సాంలో రోడ్ల అనుసంధానం మరింత పటిష్టమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గౌహతి-న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్‌లను మోదీ జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ బోడోలాండ్‌ను తప్పుడు హామీలతో దశాబ్దాలుగా వంచించిందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బోడోలాండ్ ప్రాంత ప్రజల కలలు సాకారమయ్యాయని అన్నారు. అటు కేంద్రంలో, ఇటు అస్సాంలో కాంగ్రెస్‌కు ప్రజలు ఉద్వాసన చెప్పి బీజేపీ-ఎన్డీయేకు అవకాశం ఇవ్వడంతో చిత్తశుద్ధితో తాము అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. కాంగ్రెస్ వివిధ గ్రూపుల మధ్య అసంతృప్తిని పెంచితే, శాంతి కోసం బీజేపీ పాటుపడిందని, బోడో పీస్ ఒప్పందంపై సంతకం చేసి అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చిందని చెప్పారు. అస్సాంలో చొరబాటుదారులను కాంగ్రెస్ ప్రోత్సహించిందని, గిరిజనుల భూములను అక్రమంగా చొరబాటుదారులకు కట్టబెట్టిందని మోదీ విమర్శించారు. అయితే గిరిజనుల భూములు వారికే తిరిగి ఇప్పించేందుకు ముఖ్యమంత్రి శర్మ అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. దీనికి ముందు, అస్సాంలో రెండ్రోజుల పర్యటన కోసం గౌహతి వచ్చిన మోదీకి రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ, పలువురు రాష్ట్ర మంత్రులు, సీనియర్ అధికారులు సాదర స్వాగతం పలికారు.

# శ్రీశైలం వెళ్లిన గవర్నర్ శుక్లా

(మొదటి పేజీ తరువాయి)

గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ టూరిజం మృగవాణి గెస్ట్ హౌస్‌కు శుక్రవారం సాయంత్రం చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కాసేపు విరామం అనంతరం శ్రీశైలం దర్శనానికి బయలు దేరి వెళ్లారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల లడ్డూపై టిషన్ కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి దర్యాప్తు జరపలేదని పేర్కొన్నారు. అయితే.. దర్యాప్తు పెండింగ్‌లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోలేమని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేస్తూ పిటిషన్ కొట్టివేసింది. అన్ని అంశాలు పరిశీలించాకే సీబీఐతో సిట్ వేయించామని పేర్కొంది. ఏదైనా ఉంటే సీబీఐ ముందే చెప్పుకోవాలని సూచించింది.

# ఇంధన, గ్యాస్ కొరతపై ప్రభుత్వం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గ్యాస్ ప్రొడక్షన్‌ను పెంచామని కేంద్రం తెలిపిందని, ఈ నేపథ్యంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రానికి 1740 కిలో లీటర్ల కిరోసిన్ సరఫరా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో సివిల్ సప్లై కమిషనర్, పోలీస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, వైద్య అధికారులు ఒఖఉ కంపెనీ ప్రతినిధులతో కూడిన కమిటీలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాయి. కమాండ్ కంట్రోల్ రూమ్: హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, సరఫరాలో అంతరాయాలను నివారిస్తున్నారు. తమను కూడా అత్యవసర సేవల కింద గుర్తించి సిలిండర్లు సరఫరా చేయాలని హోటల్, రెస్టారెంట్ యజమానులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అత్యవసర సేవలకు గ్యాస్ కొరత లేకుండా చూసే పూర్తి బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుందని ఉత్తమ్ చెప్పారు.

# నాణ్యమైన ఆహారాన్ని అందించండి

● కన్స్యూమర్ కమిషన్ మీడియోటర్ డి గోపాల్ నారాయణ



తొలి అక్షరం/షాద్ నగర్,మార్చి 13: హోటల్ కు వచ్చే వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించండి,వారి ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అంటూ పిలుపు నిస్తున్నారు కన్స్యూమర్ కమిషన్ మీడియోటర్ డి గోపాల్ నారాయణ...శుక్రవారం పట్టణంలోని భార్గవి మిల్లెట్స్ హెల్తీ సెంటర్/మిల్లెట్స్ ఫుడ్ సెంటర్ వారు అందిస్తున్న ఆహారాన్ని కన్స్యూమర్ కమిషన్ మీడియోటర్ డిడ్డి గోపాల్ నారాయణ తనిఖీ చేశారు.ఇందులో భాగంగా దేవిగ్రాండ్ హోటల్ వద్ద షాపులో రాగి ముద్ద ఉలవచారు/కిన్నోవా పలావ్ మిల్లెట్ పొంగల్,రాగి జావా,దేశి ఆవు బట్టర్ మిల్క,మిలెట్స్ స్నాక్స్ ను స్వయంగా ఆహారాన్ని పరిశీలించి,రుచి చూశారు.అనంతరం మాట్లాడుతూ,,, ఆరోగ్యమైనటు వంటి ఆహారాన్ని అందిస్తున్న భార్గవి రవీందర్ ను అభినందించారు.వినియోగ దారులకు మరింత,మంచిగా శుభ్రంగా ఆహారాన్ని తయారు చేయాలని,ఆహారం అందించే ముందు క్యాప్స్ ధరించాలని సూచించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి




తొలి అక్షరం/నెక్కొండ మార్చి 13: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో కేసముద్రం మండలం కాట్రపల్లి ద్రసు తండా గ్రామ వాస్తవ్యులు మహబూబాబాద్ నియోజకవర్గ టీపీసీసీ సభ్యులు గుగులోత్ ద్రసు నాయక్ కుమారుడు భార్గవ్ నాయక్ -శిరీష ల వివాహ వేడుకకి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన నర్సంపేట నియోజకవర్గ టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, మైనారిటీ నాయకులు షైక్ షబ్బీర్ వార్డ్ సభ్యులు ముద్రబోయిన శ్రీకాంత్, ఈదునూరి ప్రభాకర్ బాల్నే ప్రశాంత్,తోకల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99లో భాగంగా గ్రామంలో భూముల సర్వే

● పిట్టకాల్ బోడ్ తండా గ్రామ సర్పంచ్ బాదావత్ సూర్య.



తొలి అక్షరం/నెక్కొండ మార్చి 13:వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని పిట్టకల్ బోడ్ తండా గ్రామ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 లో భాగంగా గ్రామ పరిసర ప్రాంతాల్లోని గ్రామ కంఠం భూములు మరియు పట్టా పాస్ పుస్తకాల పరిశీలన లో పాల్గొన్న రెవెన్యూ ఆఫీసర్లు,భూముల సమస్యలపై పాల్గొన్న గ్రామ సర్పంచ్ పిట్ట కాల్ బోడ్ తండా పరిధిలోనిభగవన్ అండ లో వాటర్ సమస్యలను కూడా పరిష్కరించడం జరిగింది. సర్పంచ్ బాదావత్ సూర్య ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెక్కొండ మండల ఆర్ ఐ నరేందర్, జిపిఓ రాజు, ఆపరేటర్ దేవేందర్లు తదితరులు పాల్గొన్నారు .



# ఉప్పరిగడ్డలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

● గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం అభినందనీయం సర్పంచ్ చందు నాయక్





తొలి అక్షరం/షాద్ నగర్, మార్చి13: ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డ గ్రామంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ చందు నాయక్ ఆధ్వర్యంలో ఎంపికైన లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామంలోని పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని అన్నారు. గతంలో మొదటి విడత కింద 9 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా, వాటిని పూర్తి చేయడం జరుగుతుందని, ప్రస్తుత రెండో విడతలో మరో 5 మందికి పట్టాలు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఆయన లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంలో స్థానిక ఎమ్మెల్యే చూపిస్తున్న చొరవ, సహకారం మరువలేనిదని సర్పంచ్ చందు నాయక్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఇళ్ల అవసరం ఉన్న మరికొందరి కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, మరో 15 ఇళ్లు మంజూరు చేయడానికి ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలోనే వాటిని కూడా లబ్ధిదారులకు అందజేస్తామని వెల్లడించారు. తమకు ఇళ్ల పట్టాలు అందడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీలత తిరుపతి, ఇందిరమ్మ ఇండ్ల కమిటి సభ్యులు భీమ్లా నాయక్, బొజ్యానాయక్, గజేంద్ర నాయక్, గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవగిరి నగరంలో రాక్షస గుహలను పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్





తొలి అక్షరం/పినపాక, మార్చి 13: పినపాక మండలం పాండురంగాపురం గ్రామపంచాయతీ పరిధిలోని దేవగిరి నగరంలో ఉన్న ప్రాచీన రాక్షస గుహలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ శుక్రవారం పరిశీలించారు. ప్రాంతీయంగా ప్రత్యేకత కలిగిన ఈ గుహలను ప్రత్యక్షంగా సందర్శించిన ఎస్పీ, అక్కడి పరిస్థితులు, భద్రతా అంశాలను అధికారులతో కలిసి సమీక్షించారు.గుహల చుట్టుపక్కల ఉన్న అడవి ప్రాంతం, అక్కడికి వెళ్లే మార్గాలు, వంటి విషయాలపై వివరాలు తెలుసుకున్నారు. గుహల ప్రాంతంలో అనవసరంగా ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేవగిరి ప్రాంతంలోని రాక్షస గుహలు చారిత్రకంగా, సహజసిద్ధంగా ప్రత్యేకత కలిగిన ప్రదేశమని తెలిపారు. ఈ ప్రాంతాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గుహల వద్ద పరిశుభ్రతను కాపాడాలని, ప్రకృతికి హాని కలిగించే చర్యలు చేయవద్దని ప్రజలకు సూచించారు.అలాగే స్థానిక యువత, గ్రామస్థులు ఈ ప్రాంతాన్ని సంరక్షించడంలో సహకరించాలని కోరారు. అవసరమైతే పర్యాటకులు, సందర్శకుల భద్రత కోసం పోలీసు శాఖ తరపున తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ పరిశీలన కార్యక్రమంలో మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్,స్థానిక పోలీసులు, సింగిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ కిషోర్,అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో కారు చెరువులోకి.. కేసు నమోదు: షాద్‌నగర్ సిఐ కె సీతారాం వెల్లడి





తొలి అక్షరం/షాద్ నగర్, మార్చి13: మద్యం మత్తులో కారు అతివేగంగా నడపడంతో చెరువులో పడిపోయిన ఘటన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 12వ తేదీ రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో షాద్‌నగర్ దూసకల్ రోడ్డులోని చటాన్‌పల్లి, సురసముద్రం చెరువు సమీపంలో గ్రాండ్ విటారా కారు (నంబర్: టూ34ఎ9695) చెరువులో పడిపోయిందని సమాచారం అందింది. వెంటనే షాద్‌నగర్ పోలీసులు, డీఆర్ఎఫ్ బృందం సంఘటన స్థలానికి చేరుకుని కారును చెరువులో నుంచి బయటకు తీశారు.కారు నంబర్ ఆధారంగా యజమాని వివరాలు తెలుసుకోగా బండ్లగూడ జాగీర్ వ్యాలీ కాలనీకి చెందిన కాజ్జామ్ రామంతగా గుర్తించారు. ఆయన తన కారును తన స్నేహితుడు నలందానగర్, అత్తాపూర్‌కు చెందిన శ్రీకాంత్ రెడ్డికి ఇచ్చినట్లు తెలిసింది.శ్రీకాంత్ రెడ్డి తన స్నేహితుడు నరేష్‌తో కలిసి షాద్‌నగర్ మండలంలోని దూసకల్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా మద్యం సేవించి కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో కారు చెరువులో పడిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో కారు పూర్తిగా దెబ్బతిన్నట్లు వెల్లడించారు.కారు యజమాని కాజ్జామ్ రామంత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు మద్యం మత్తులో కారు చెరువులోకి.. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పట్టణ సిఐ కె సీతారాం మీడియాకు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ తక్షణ కర్తవ్యం..

● లేదంటే ప్రమాదంలోకి మానవ భవిష్యత్తు..

● అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి..

● నల్గొండలో జరిగిన జాతీయ సెమినార్లో మాట్లాడిన షాద్ నగర్ ప్రొఫెసర్



తొలి అక్షరం/షాద్ నగర్, మార్చి13: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు కచ్చితంగా ఒక బాధ్యతగా భావించాలి.. లేదంటే భవిష్యత్ ఇంకా ప్రమాదంలో పడే అవకాశం ఉంది.. దీనివల్ల దేశం సమస్యల్లో చిక్కుకొని జిడిపి పైన ప్రభావం పడే అవకాశం ఉంటుందని షాద్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి సూచించారు. నల్గొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ స్పాన్సర్స్ తో నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ రిసోర్సెస్ క్లీన్ ఎన్విరాన్మెంట్ ఇన్ ఇండియా పేరుతో జరుగుతున్న జాతీయ సెమినార్లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందుకున్న ఆయన పర్యావరణం క్షీణిత దేశ ఆర్థిక వ్యవస్థ పై దాని ప్రభావం అనే అంశం మీద పరిశోధనా పత్రాన్ని సమర్పించాడు. ప్రతి ఒక్కరూ తమ సౌకర్యం కోసం ఏదో ఒక రూపంలో వాయు నీరు కాలుష్యానికి అటవీ నిర్మూలనకు కారణం అవుతున్నారని, వీటి వల్ల జరిగే అనర్థాలను డేటాతో సహా ఆయన వివరించారు. దీనివల్ల దేశ జీడీపిలో మూడు శాతం వరకు నష్టం జరుగుతుంది అని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ జలపతి హాజరైనట్లు వివరించారు.

# కవితక్కకు జన్మదిన శుభాకాంక్షల ఉద్యమ గాయకుడు మురళి నాగెల్లి మర్యాదపూర్వక భేటీ

● బంజారాహిల్స్ నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపిన మురళి

● తెలంగాణ ఉద్యమంలో, మహిళా చైతన్యంలో కవితక్క పాత్ర చిరస్మరణీయం

● ఆమె నాయకత్వం యువతకు నిరంతర స్ఫూర్తిదాయకమని కొనియాడారు



తొలి అక్షరం/ఇనుగుర్తి మార్చి 13: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకుని ఇనుగుర్తి మండలానికి చెందిన ప్రముఖ ఉద్యమ గాయకుడు మురళి నాగెల్లి ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల ఆమె స్వగృహంలో కవితను కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మురళి నాగెల్లి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజలను చైతన్య పరచడంలో, ముఖ్యంగా బతుకమ్మ పండుగను విశ్వవ్యాప్తం చేసి మహిళా సాధికారతకు కృషి చేయడంలో కవితక్క పోషించిన పాత్ర అమోఘమని పేర్కొన్నారు. ఆమె సేవా దృక్పథం, రాజకీయ నాయకత్వం నేటి యువతకు గొప్ప స్ఫూర్తినిస్తాయని కొనియాడారు.తన గాత్రంతో తెలంగాణ సంస్కృతిని, ఉద్యమ ఆకాంక్షలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిన మురళి నాగెల్లి, కవితక్క నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆమెకు తన ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు.


# ఆగమోత్కూర్ శివారులో పేకాట స్థావరంపై దాడి: ఎనిమిది మందిపై కేసు నమోదు: ఎస్ఐ ఎస్ కృష్ణయ్య




తొలి అక్షరం/మాడుగులపల్లి/మార్చి 13; నమ్మదగిన సమాచారం మేరకు గురువారం అర్ధరాత్రి మండల పరిధిలోని ఆగమోత్కూర్ గ్రామ శివారులో పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో వెళ్ళిన పోలీసులకు ఎనిమిది మంది వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించారు. ఇద్దరు అరెస్ట్, ఆరుగురు పరారీ,పోలీసుల రాకను గమనించిన నిందితులు అక్కడి నుండి తప్పించుకునే ప్రయత్నం చేశారు. వారిలో ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడగా, మిగిలిన ఆరుగురు చీకటిలో పరారయ్యారు. పట్టుబడిన వారిని విచారించగా, ఈ పేకాటలో మొత్తం ఎనిమిది మంది పాల్గొన్నట్లు గుర్తించారు.నిందితుల వివరాలు:పిల్లల మధు (తండ్రి: జానయ్య) అవిరెండ్ల సుదర్శన్ (తండ్రి: వెంకటయ్య) బంటు సైదులు (తండ్రి: రాములు)బొడ్డు శ్రీను (తండ్రి: పిచ్చయ్య) కంకణాల రవి (తండ్రి: బిక్షం)గూడపూరి మనోజ్ (తండ్రి: దానయ్య)నక్క శంకర్ (తండ్రి: చంద్రయ్య) వల్లపు దాసు పవన్ (తండ్రి: మోశయ్య) ఉన్నారు.నగదు, వాహనం స్వాధీనం:సంఘటనా స్థలం నుండి 2000 రూపాయల నగదు, ఒక స్కూటీ, మరియు రెండు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# ఇఫ్తార్ విందు ఇచ్చిన సర్పంచ్ విక్రమ్





తొలి అక్షరం/రామన్నపేట మార్చి 13: ముస్లిం సోదరుల పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మజీద్ లో ముస్లిం సోదరులకు గర్ధాస్ విక్రమ్ సర్పంచ్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు లి. లిఈకార్యక్రమం లో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి,వార్డ్ మెంబెర్లు,యువనాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్,ముస్లిం మతపెద్దలు, ముస్లిం సోదరులు, సీనియర్ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.


## ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99లో భాగంగా పచ్చదనం పరిశుభ్రత

● నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్



**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 13:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణ బిసి కాలనీ అభివృద్ధికై సిసి రోడ్డు ఏర్పాటు కోసం పరిశీలిస్తున్న నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ మరియు స్థానిక నాయకులు రాసమల్ల రాజేష్ , పసునూరి ప్రభాకర్ , రేకుల రాజేందర్ , మహమ్మద్ పాషా, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన చెరువు ముందు తండ సర్పంచ్ కున్సోత్ మంగమ్మ- శ్రీనివాస్



**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 13:**
వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికొండ తండలో నూతన వధూవరులను ధరావత్ వాగ్య- మారు ల ద్వితీయ కుమారుడు విశాల్- పూజ వివాహ వేడుకకు హాజరై ఆశీర్వదించిన చెరువు ముందరి తండా గ్రామ సర్పంచ్ కునసోతు మంగమ్మ - శ్రీను, ఉప సర్పచ్ ముదు మంగమ్మ - రాజేందర్ వార్డు సభ్యురాలు గుగులోతు సరోజ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం



**తొలి అక్షరం/రామన్నపేట :** పట్టణ కేంద్రంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన పారిశుద్ధ కార్మికుడు గాదే నరసింహ కుటుంబానికి సర్పంచ్ గరిక సత్యనారాయణ గ్రామపంచాయతీ నిధుల నుండి 33వేలు ఆర్థిక సహాయని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..... గ్రామపంచాయతీలో పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన నరసింహ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోటే రమేష్, మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్, వార్డు సభ్యులు, నాయకులు ఎండి అక్రమ్, జాడ సంతోష్, కొమ్ము శేఖర్, మోటె మహేష్, కొమ్ము రామస్వామి, అన్వర్, నకరకంటి సుదర్శన్, గొరిగే శేఖర్, బండ లింగస్వామి, రాపోలు ఉపేందర్, ఊట్కూరు శీను, గ్రామపంచాయతీ సిబ్బంది రాజ్ కుమార్, నకిరేకంటి రాము, గాదె యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆశీర్వాదం అందించిన దైద రవీందర్



**తొలి అక్షరం/రామన్నపేట మార్చి 13:** దుబ్బక గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు గట్టు నరేందర్ సోదరుడు గట్టు రవి కుమార్తె కుమారుని నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండాల సతీష్ గౌడ్ ఉప సర్పంచ్ రమేష్ గౌడ్ స్వామి మహేష్ రమేష్ గట్టు శ్రీను వెంకటేష్ రామ్ రామ్ ముత్యగిరి మరియు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా ఎజెండా అమలు పరచండి

**షాద్‌నగర్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించండి**

**మున్సిపల్ చైర్మన్‌కు సామాజిక వేత్త వంగూరి గంగిరెడ్డి విజ్ఞప్తి**

**మున్సిపల్ చైర్మన్‌ను సన్మానించిన వంగూరి గంగిరెడ్డి**





**తొలి అక్షరం/షాద్ నగర్, మార్చి13:** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ గా ఎన్నికైన అగ్గనూరి బసవేశ్వర్ సామాజికవేత్త వంగూరి గంగిరెడ్డిని వారి స్వగృహంలో కలిసి పట్టణంలోని సమస్యలను గురించి చర్చించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ కు మిఠాయిలు తినిపించి శాలువా కప్పి గంగిరెడ్డి సన్మానించారు. అనంతరం ఎన్నికల సమయంలో పట్టణంలోని ప్రజల ఆకాంక్షలుగా వెలుగులోకి వచ్చిన సమస్యలను క్రోడీకరించి" ప్రజా ఏజెండాగా " గంగిరెడ్డి రూపొందించిన వినతిపత్రాన్ని చైర్మన్ కు అందజేశారు. వాటిని పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో అమలు పరిస్తే షాద్ నగర్ పట్టణ రూపురేఖలు మారిపోతాయని అన్నారు. ప్రజాఎజెండాలోని అంశాలపై వారిద్దరి మధ్య విస్తృత చర్చ జరిగింది. వినతి పత్రంలోని అంశాలపై చైర్మన్ బసవేశ్వర్ సానుకూలంగా స్పందిస్తూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో వాటిని అమలుపరచి షాద్ నగర్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. **ప్రజా ఎజెండా లోని అంశాలు..:** 1.షాద్ నగర్ పట్టణ హైవే చౌరస్తాను 100 ఫీట్ల దయాతో రౌండ్ అబౌట్ సర్కిల్ చేసి రోడ్డు విస్తరణ చేయడం 2.వివిధ కాలనీలలో మురుగు కాలువలు అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం. 3.రోడ్డుకు ఇరువైపులా ట్రీ గార్డుతో కూడిన మొక్కలు నాటించడమే కాకుండా నీటి సరఫరాతో వాటిని పెంచి పచ్చదనం పెంపొందించడం. 4.ప్రతి వార్డులో ఓపెన్ జిమ్ తో కూడిన పార్కును అభివృద్ధి పరచడం. 5.వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడానికి పల్లపు ప్రాంతాలలో మున్సిపాలిటీ ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణం. 6.ప్రధాన రహదారులలో మూత్రశాలల నిర్మాణం. 7.పరిశుభ్రమైన వాతావరణంలో ప్రశాంతమైన ప్రజాజీవనం కొరకై కుక్కలు పందులు దోమల నివారణ చర్యలు చేపట్టడం. 8.డంప్ యార్డ్ ఆధునికీకరణ 9. సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఓపెన్ ఎయిర్ థియేటర్ (కళా భవన్) నిర్మాణానికి కృషి. 10.ఖాళీ స్థలాల్లో గల పిచ్చి మొక్కలు చెత్త చెదారం శుభ్రపరచడం. 11.చటాన్ పల్లి రోడ్డు కేశంపేట్ రోడ్లలో గల రైల్వే గేట్ ల వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కృషి చేయడం. 12.అర్ధాంతరంగా ఆగిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను పూర్తి చేయడానికి కృషిచేయడం. 13.సామాన్య ప్రజలు చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకోవడానికి అనుకూలంగా కమ్యూనిటీ హాల్స్ నిర్మించడం. 14. కమ్మదనం అటవీ ప్రాంతంలో ఎకో పార్క్ నిర్మాణం గావించడం. 15.ఇందిరానగర్ కాలనీ ,శ్రీనివాస కాలనీ ,విజయనగర్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ వద్ద గల గుంతల్లోని మురుగునీటికి పరిష్కారం. 16.ప్రస్తుతమున్న బస్ స్టాండ్ సరిపోనందున బస్ డిపోను వేరే ప్రాంతానికి తరలించి బస్టాండ్ విస్తరించేందుకు కృషి చేయడం. 17.కేశంపేట రోడ్ లోని యమ్మీ హోటల్ వద్ద "మినీ బస్టాండ్ " ఏర్పాటు చేయడం కోసం కృషి చేయడం. 18.హైదరాబాదు నుండి సబర్బన్ బస్సులు నడపడానికి కృషి చేయడం. 19.షాద్నగర్లో టౌన్ సర్వీసులు రాయికల్ టోల్గేట్ నుండి లింగారెడ్డిగూడెం వరకు, కమ్మదనం నుండి ఎలికట్ట చౌరస్తా వరకు నడపడానికి కృషి చేయడం. 20.ముంబాయి బైపాస్ రోడ్డు షాద్ నగర్ పట్టణంలో నుండి పోవడం వలన పెద్ద పెద్ద ట్రక్కులు రావడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. కాబట్టి పట్టణం వెలుపల నుండి పోయే మార్గం కొరకు ప్రయత్నించడం. 21.స్థానిక పరిశ్రమలలో యువతకు ఉద్యోగాలకై ప్రయత్నించడం..

# నీలాద్రిపేట గండిలో మేగా మెడికల్ క్యాంప్

**ఎస్పీ రోహిత్ రాజ్, ఓ ఎస్డీ నరేందర్ చేతుల మీదుగా సోలార్ లైట్లు, నిత్యావసరాల పంపిణీ**

**విద్యార్థులకు బ్యాగులు, యువతకు వాలీబాల్ కిట్లు, మహిళలకు చీరలు అందజేత**

**గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు**







**తొలి అక్షరం/పినపాక, మార్చి13:** కరకగూడెం మండలం నీలాద్రిపేట గండి గ్రామంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, కరకగూడెం పోలీసుల ఆధ్వర్యంలో మేగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఓఎస్డీ నరేందర్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలాద్రిపేట గండి గ్రామస్తులకు సోలార్ లైట్లు, నిత్యావసర సామగ్రి, మహిళలకు చీరలు, విద్యార్థులకు పాఠశాల బ్యాగులు పంపిణీ చేయడంతో పాటు యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ...యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా విద్యపై దృష్టి పెట్టాలని సూచించారు. తల్లిదండ్రులు చిన్న వయసులోనే పిల్లలను పనులకు పంపకుండా తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని, వారి భవిష్యత్తుకు విద్య ఎంతో ముఖ్యమని తెలిపారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.గ్రామంలో ఎవరూ మద్యానికి బానిసై గొడవలకు దిగకుండా శాంతి భద్రతలను కాపాడాలని సూచించారు. గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించే విషయమై జిల్లా కలెక్టర్తో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఓ ఎస్ డి నరేందర్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. గ్రామస్తులు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ తమ సమస్యలను తెలియజేస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు.డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామాల్లో శాంతి భద్రతలను కాపాడటం అందరి బాధ్యత అని తెలిపారు. గ్రామస్తులు పోలీసులకు సహకరించి సమస్యలు ఉంటే ఉంటే ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ....గ్రామాల్లో నేరాలు, చెడు అలవాట్లు లేకుండా సమాజాన్ని మంచి దిశలో నడిపేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోందని తెలిపారు. గ్రామస్తులు చట్టాలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు. కరకగూడెం ఎస్సై పి.వి.ఎన్. రావు మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం యువకులతో కలిసి ఎస్పీ రోహిత్ రాజ్ సరదాగా వాలీబాల్ ఆడుతూ వారిని ప్రోత్సహించారు. మేగా మెడికల్ క్యాంప్‌లో గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, కరకగూడెం ఎస్సై పి.వి.ఎన్. రావు, స్థానిక ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ రవితేజ, మణుగూరు సూపరింటెండెంట్ సునీల్, ప్రైవేట్ వైద్యులు డాక్టర్ శశిధర్, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ జయశ్రీ, డాక్టర్ ఉమాశంకర్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..

● గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం





**తొలి అక్షరం/మాదుగులపల్లి/మార్చి 13:** మండల పరిధిలోని ఆగమోత్కూర్ గ్రామంలో గల గౌతమ్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ శిరీష, చైర్మన్ రమేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మహేశ్వరి మాట్లాడుతూ, తమ పాఠశాలలో విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లోనూ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. **విధులు నిర్వహించిన విద్యార్థి 'అధికారులు':** స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మరికొందరు విద్యార్థులు ఎమ్మెల్యే, కలెక్టర్, డాక్టర్ల వేషధారణలో వారి విధులను అద్భుతంగా నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. ఒక రోజు పాటు పాఠశాల పాలనా బాధ్యతలను విద్యార్థులే స్వీకరించి క్రమశిక్షణతో వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, స్వప్న, రష్మిక, ప్రమీల, సనా మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99లో భాగంగా గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు

● బంజరపల్లి సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్





**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 13:**వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని బంజర పల్లి గ్రామం ఎస్సీ కాలనీలో గత 5 సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న కరెంట్ లైన్ పనులను పునరుద్ధరించిన బంజరపల్లి సర్పంచ్ రమేష్ రాథోడ్.బంజరపల్లి గ్రామం ఎస్సీ కాలనీ మందవాడలో గత 5 సంవత్సరాల నుంచి అసంపూర్తిగా ఉన్న కరెంటు లైన్ మరియు వీధి దీపాలను పునరుద్ధరించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలు ఇచ్చిన మాట ప్రకారం మందవాడకు కరెంటు వైర్ మరియు విద్యుత్ దీపాలను అమర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యర్ర సుజాత- రాజు, వార్డ్ నెంబర్ కుప్ప స్వామి, మరియు కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# పేదోడిని దోచుకోవద్దు.. ప్రాణాలతో చెలగాటం వద్దు: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్







**అనవసర పరీక్షలతో ప్రజలను ఇబ్బంది పెట్టవద్దు.**

**ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా రక్తదాన శిబిరం**

**సేవాభావంతో వైద్యం అందించాలి...వైద్యులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన**

**తొలి అక్షరం/షాద్ నగర్, మార్చి13:** పేద ప్రజలను దోచుకోవద్దని, రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లకు సూచించారు. షాద్‌నగర్ పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో బుగ్గారెడ్డి ఆసుపత్రి, తెలంగాణ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఆసుపత్రుల నిర్వాహకులు, వైద్యులు తమ ఆశలను తగ్గించుకొని సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో వైద్యం అందించాలని సూచించారు. కొంతమంది ల్యాబ్ టెక్నీషియన్లు ఇచ్చే తప్పుడు రిపోర్టుల వల్ల రోగులకు ప్రాణాపాయం ఏర్పడే పరిస్థితులు వస్తున్నాయని, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యులను రోగులు రెండో దేవుడిగా భావిస్తారని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టేలా సేవాభావంతో పనిచేయాలని అన్నారు. కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో మరణించిన తర్వాత కూడా రోగి బ్రతికే ఉన్నాడని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు జరుగుతున్నాయని, అలాంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. కష్టపడి చదివిన వైద్యులు సమాజానికి ఉపయోగపడేలా సేవలు అందించాలని సూచించారు. డాక్టర్ అనురాగ్ రెడ్డి తాత బుగ్గారెడ్డి పేరుతో నడుస్తున్న ఆసుపత్రి సమాజానికి ఉపయోగపడేలా పనిచేయాలని అన్నారు. **తప్పుడు రిపోర్టులు ఇవ్వొద్దు. డాక్టర్ విజయలక్ష్మి** ల్యాబ్ టెక్నీషియన్లపై ఎంతో బాధ్యత ఉంటుందని డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. కొంతమంది అనుభవలేమితో తప్పుడు రిపోర్టులు ఇవ్వడం వల్ల రోగులకు తప్పుడు చికిత్స అందే ప్రమాదం ఉంటుందని, దీనివల్ల ప్రాణాపాయం కూడా ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ల్యాబ్ టెక్నీషియన్లు మరింత జాగ్రత్తగా పనిచేయాలని సూచించారు. **ప్రాణాలతో చెలగాటం వద్దు. మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్** ల్యాబ్ టెక్నీషియన్లు రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడకూడదని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అన్నారు. తప్పుడు రిపోర్టుల వల్ల ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తుతాయని, అందరూ నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. అసోసియేషన్ కార్యక్రమాలకు మున్సిపాలిటీ తరఫున సహకారం అందిస్తామని తెలిపారు. **యువసత్తా లక్ష్మణ్ సేవలకు ఎమ్మెల్యే ప్రశంసలు** రక్తదానం చేస్తూ ప్రాణాలను కాపాడే యువసత్తా లక్ష్మణ్ సేవలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రశంసించారు. స్వార్థం లేకుండా సమాజం కోసం పనిచేస్తున్న లక్ష్మణ్ వంటి యువకులు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. అలాగే రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్, పోలీసు శాఖ, జర్నలిస్టులు అందిస్తున్న సేవలను కూడా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, కృష్ణారెడ్డి, కౌన్సిలర్ మురళీమోహన్, డాక్టర్ అనురాగ్ రెడ్డి, యువసత్తా లక్ష్మణ్, టిడిపి జిల్లా అధ్యక్షుడు అరవింద్, షాద్‌నగర్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, ఉపాధ్యక్షులు అమరేందర్ సురేష్, నవీన్ చారి, పండు నాయక్, లాలు నాయక్, రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రెంత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయూత

- **బత్తిని రాజు ఆర్థిక సహకారంతో 10వ తరగతి విద్యార్థినిలకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్స్ పంపిణీ**





**తొలి అక్షరం/రామన్నపేట మార్చి 14:** రామన్నపేట ప్రభుత్వ బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినిలకు పరీక్షల సందర్భంగా ఎగ్జామ్ పాడ్స్, పెన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని స్ట్రెంత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బత్తిని రాజు ఆర్థిక సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థినులు పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. స్ట్రెంత్ ఫౌండేషన్ ఫౌండర్ & చైర్మన్ ఎర్ర నరేష్ మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదివి జ్ఞానం సంపాదించుకోవాలని, విద్యే మనిషికి నిజమైన సంపద అని అన్నారు. పరీక్షలను ధైర్యంగా రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బత్తిని రాజు, ఆవుల సాయి, ఆవుల మత్స్యగిరి, అధ్యాపక బృందం విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సి పరీక్షలకు పటిష్ట పోలీస్ బందోబస్తు

- **పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు..ఎస్ఎస్‌సి పరీక్షలకు పోలీసుల ప్రత్యేక చర్యలు**
- **విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి పోలీసుల ప్రత్యేక ఏర్పాట్లు**




**తొలి అక్షరం/షాద్ నగర్, మార్చి13:** ఫ్యూచర్ సిటీ కమీషనరేట్ పరిధిలో మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల కోసం పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు ఐపీఎస్ తెలిపారు. ఈ ఏడాది ఫ్యూచర్ సిటీ పరిధిలో సుమారు 15,764 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద శాంతిభద్రతల కోసం పోలీస్ సిబ్బందిని మోహరించనున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ల నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలను తరలించే సమయంలో, అలాగే జవాబు పత్రాలను తిరిగి పంపించే సమయంలో ప్రత్యేక ఎస్కార్ట్ బృందాలు భద్రత కల్పిస్తాయని వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, టాబ్లెట్లు, స్మార్ట్ వాచ్‌లు, పెన్ డ్రైవ్‌లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావడం పూర్తిగా నిషేధమని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో గుంపులుగా చేరకుండా ఉండేందుకు బి.ఎన్.ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల సమీపంలోని జెరాక్స్ సెంటర్లను పరీక్షల సమయంలో మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పేపర్ లీకేజీ పుకార్లను అరికట్టేందుకు ప్రత్యేక స్క్వాడ్లు, మఫ్టీ పోలీసులు నిఘా ఉంచుతారని వెల్లడించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ విభాగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల జోన్ల నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి ఎక్కడైనా అక్రమాలు లేదా మాల్ ప్రాక్టీస్ జరిగినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పోలీసులకు సహకరించి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

## వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో రైతుల పంట అమ్మకంపై ఆర్థిక భారాన్ని తగ్గించాలి

- **దాడువాయిల చార్జీలు మార్కెట్ కమిటీ భరించాలి**
- **జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన రైతు సంఘాల నాయకులు**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ వ్యవసాయ మార్కెట్లో రైతుల పంట అమ్మకంపై ఆర్థిక భారాన్ని వేయవద్దని, రైతు సంఘాల నాయకులు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కు రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి తూకం వేసే దాడువాయిలకు మార్కెట్ కమిటీ ఒక్కో బస్తాకు 6.25 రూపాయల చొప్పున రైతులే చెల్లిస్తున్నారు. దాడువాయిలకు రెండు సంవత్సరాలకు ఒకసారి 20% రేట్లు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పెంచుతున్నారు. వీరికి 1963 సంవత్సరం నుండి కొన్ని సంవత్సరాలు మార్కెట్ కమిటీ చెల్లించేది, మళ్లీ కొన్ని సంవత్సరాల రైతుల పంటను కొనుగోలు చేసే వ్యాపారస్తులు చెల్లించేవారు. 2012 సంవత్సరంనుడీ రైతులు చెల్లించే విధంగా ప్రభుత్వ అధికారులు గెజిట్ ను విడుదల,చేయడంతో ఆనాటి నుండి ఈరోజు వరకు రైతులే భరిస్తున్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్లో కి అమ్ముకోవడానికి తీసుకొస్తే అనేకమైన ఖర్చుల నెపంతో వారిపై ఆర్థికంగా భారం మోపుతున్నారు. రైతులు ఈ ఖర్చుల భారం మోయలేక మార్కెట్లోకి పంటను తీసుకురాకుండా గ్రామాల్లోని ప్రవేటు వ్యాపారస్తులకు పంటను అమ్ముకోవడంతో మార్కెట్కు వచ్చే కోట్ల ఆదాయాన్ని రాకుండా పోతున్నది. రైతులు గ్రామాలలో ప్రైవేటు వ్యాపారులకు అమ్మడం వలన సరైన ధర కూడా అందడం లేదు. రైతులపై ఖర్చుల భారాన్ని తగ్గియ్యాలని ప్రభుత్వాలు అంటూనే ఉన్నాయి కానీ ఈరోజు వరకు అమలు చేయడం లేదు. ఇప్పటికైనా మార్కెట్లోని దడువాయిల చార్జీలు మార్కెట్ కమిటీ లు చెల్లించాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ ను కలిసి వినతి పత్రం ఇచ్చిన వారిలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అఖిల భారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు అఖిల భారత కిసాన్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు సుధమల్ల భాస్కర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఓదెల రాజయ్య బండి వెంకటేశ్వర్లు ఉన్నారు.

## కల్వలపాలెంలో మానవత్వం: మృతురాలి కుటుంబానికి గ్రామస్థుల అండ



**తొలి అక్షరం/మాడుగులపల్లి/మార్చి 13:** కష్టాల్లో ఉన్న సాటి మనిషిని ఆదుకోవడంలో తాము ఎప్పుడూ ముందుంటామని మాడుగుల పల్లి మండలం కల్వలపాలెం గ్రామ ప్రజలు మరోసారి నిరూపించారు. అదే గ్రామానికి చెందిన పన్నీరు అనంతలక్ష్మి ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందడం ఆ కుటుంబంలో తీరని లోటును మిగిల్చింది. ఆమె నిరుపేద కుటుంబాన్ని చూసి చలించిపోయిన గ్రామస్థులు, తమ వంతు సాయంగా విరాళాలు సేకరించి 33,000 రూపాయల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు మరియు గ్రామ నాయకులు పాల్గొని అనంతలక్ష్మి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పోకల రాజు మాజీ ఎంపీపీ మరియు గౌరవ సలహాదారులు, కేసాని పూర్ణయ్య BRS గ్రామశాఖ అధ్యక్షులు, నాంపల్లి జగన్ BRS నాయకులు, నాంపల్లి గిరి, పోనుగోటి మోహన్ రావు, వార్డు మెంబర్లు, కేసాని సాగర్, చిట్యాల అబ్రహం, నల్లబోతు సైదులు, చిట్యాల ఏసోబు, చిట్యాల మార్కయ్య, గడ్డమీది శ్రీకాంత్, వీరబోయిన శివ, చింతకాయల సైదులు, చిట్యాల శ్రీను పాల్గొన్నారు.

## గ్రామానికి ఆదర్శం




**తొలి అక్షరం/రామన్నపేట మార్చి 13:** సిరిపురం గ్రామానికి చెందిన పున్న మల్లేశం నేత రూపొందించిన వరల్డ్ క్లాక్ ఆవిష్కరణ శుభ సందర్భంగా ఆయనను వారి స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మరియు భాగ్యలక్ష్మి కి సన్మానం చేయడం జరిగింది. ఈ ఆవిష్కరణ సిరిపురం గ్రామానికి మరింత గౌరవాన్ని తీసుకొచ్చిన ఒక మధుర క్షణంగా నిలిచింది. ఈ సందర్బంగా తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహా నేత మాట్లాడుతూ, మిత్రులు మల్లేశం రూపొందించిన వరల్డ్ క్లాక్ ద్వారా ఒకేసారి 176 దేశాలకు సంబంధించిన సమయాన్ని తెలుసుకునే అపూర్వ అవకాశం కల్పించారని ప్రశంసించారు. ఇది నిజంగా ఒక అద్భుతమైన, వినూత్న ఆవిష్కరణ అని అన్నారు. గతంలో కూడా మల్లేశం కలియుగ క్యాలెండర్ రూపొందించి, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ మరియు ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ ఆఫ్ ఎక్సలెంట్ సంస్థల నుంచి ప్రశంసాపత్రాలు అందుకోవడం సిరిపురం గ్రామానికి మాత్రమే కాకుండా తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని తెలిపారు. భవిష్యత్తులో కూడా మల్లేశం మేధస్సు మరిన్ని వినూత్న పరిశోధనలతో వెలుగొందాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవ్వకుండా బోర్డు పరీక్షలు వ్రాయాలి






- **ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్**

**తొలి అక్షరం/రామన్నపేట మార్చ్ 14:** ఎస్ఎఫ్ఐ రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో గత ఆదివారం రోజున పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది అందులో భాగంగా టాలెంట్స్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి కార్యక్రమం రామన్నపేట మండల కేంద్రం లోని కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్ స్కూల్లో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్ పాల్గొని సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా ఎలాంటి భయాందోలనకు గురి అవ్వకుండా ఒత్తిడి లేకుండా ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని పరీక్షల సమయంలో సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని మొబైల్ ఫోన్స్ వాడొద్దని సరైన సమయాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు పరీక్షలు రాసి వారికి, వారి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఈ జిల్లాలో రామన్నపేట మండలం మొదటి స్థానంలో వచ్చే విధంగా విద్యార్థులు మంచి ప్రయత్నం చేయాలన్నారు మండల స్థాయిలో మొదటి బహుమతి కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్ సుంచు ప్రణతి



ద్వితీయ బహుమతి వివేకనంద హై స్కూల్ కట్ట హరిణి సాధించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ఎఫ్ఐ నాయకులు బుంగ చంటి ఎరుముల శంకర్ భుఖ్య సంతోష్ నవదీప్ తదితరులు పాల్గొన్నారు

# స్నేహం,ఐక్యత,సోదర భావానికి ప్రతీక రంజాన్ పండుగ

## హిందూ,ముస్లింలు గంగా జమునా తహజీబ్ లా పండుగలు జరుపుకోవాలి: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ముస్లింలకి ప్రత్యేక ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ ఇఫ్తార్ విందులో ఎం ఎల్ సి,కూడా చైర్మన్,హాజ్ కమిటీ చైర్మన్,నగర మేయర్ లు పాల్గొన్నారు. స్నేహం, ఐక్యత, సోదర భావానికి ప్రతీకగా నిలిచే పవిత్ర రంజాన్ పండుగను హిందూ,ముస్లింలు గంగాజమునా తహజీబ్ స్ఫూర్తితో కలిసి జరుపుకోవాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరుల కోసం శుక్రవారం హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ప్రత్యేక ఇఫ్తార్ విందును నిర్వహించారు. ప్రతియేటా పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులకు ప్రత్యేక ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం ఆనవాయితీగా కొనసాగిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ముస్లిం మత పెద్దలు, యువకులు,ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రార్థనలు నిర్వహించారు. సుమారు 2000 మందికి పైగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ...పవిత్ర రంజాన్ మాసం ఉపవాసం,త్యాగం,సేవా భావం,పరస్పర సహకారానికి ప్రతీక అని తెలిపారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పడంలో ఈ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. వరంగల్ నగరం ఎప్పటి నుంచో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందని,అన్ని మతాల ప్రజలు కలిసి పండుగలు జరుపుకోవడం ఈ నగర ప్రత్యేకత అని పేర్కొన్నారు. ముస్లిం సోదరుల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అన్నారు. మైనార్టీల విద్యా అభివృద్ధి,ఉపాధి అవకాశాల పెంపు,స్వయం ఉపాధి పథకాల అమలు,మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు,మసీదులు మరియు మత సంబంధిత స్థలాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ముస్లిం యువతకు విద్యా రంగంలో ప్రోత్సాహం అందించేందుకు వారి సామాజికఆర్థిక అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. రంజాన్ పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని పేద ముస్లిం కుటుంబాలకు సహాయంగా సుమారు 1700 మందికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రంజాన్ బహుమతులు అందజేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని 7 ప్రధాన మస్జిద్‌లలో ఇఫ్తార్ విందుల నిర్వహణకు గాను రూ.7 లక్షల నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇదే కాకుండా సుమారు 100 మంది ముస్లిం మత పెద్దలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్వయంగా కొత్త బట్టలు అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముస్లిం సోదరుల పట్ల తనకు ఉన్న అభిమానం,గౌరవానికి ఇది నిదర్శనమని తెలిపారు. ముస్లిం సోదరుల సమస్యలను పరిష్కరించడం,వారి అభివృద్ధికి సహకరించడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. రానున్న రోజుల్లో కూడా మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తామని తెలిపారు. ఈ ఇఫ్తార్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య,రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్,ఖాజీపేట దర్గా పీఠాధిపతి కుసురు పాషా,కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,నగర మేయర్ గుండు సుధారాణి యూనికాన్ కూలర్స్ అధినేత ఇస్మాయిల్ తదితరులు హాజరయ్యారు.








# రక్తదానం ప్రాణదానంతో సమానం: ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి

## వరల్డ్ ల్యాబ్ టెక్నీషియన్స్ డే సందర్భంగా రక్తదాన శిబిరం

## రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

## పాల్గొన్న అందె బాబయ్య, ఏసిపి లక్ష్మీనారాయణ తదితరులు

**తొలి అక్షరం/షాద్ నగర్,మార్చి13:** రక్తదానము ప్రాణదానంతో సమానమని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. తెలంగాణ డైగ్నోస్టిక్ వరల్డ్ ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా షాద్ నగర్ పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాని సందర్శించారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఈ శిబిరంలో పాల్గొని రక్తాన్ని దానం చేయాలని మనమందించే రక్తంతో ఎంతోమంది ప్రాణపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడిన వాళ్లమవుతామని, ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నోస్టిక్ ల్యాబ్ టెక్నీషియన్స్‌ని అభినందించారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. బిజెపి రాష్ట్ర కార్యదర్శి అందె బాబయ్య, ఎసిపి లక్ష్మీ నారాయణ, కౌన్సిలర్ నందరం అశోక్, మాజీ కౌన్సిలర్ నందకిషోర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నక్కల వెంకటేష్,శివ చారి,దినేశ్ సాగర్,యువసత్తా లక్షణ్ ,టిడిఏ జిల్లా ప్రెసిడెంట్ అరవింద్ చారీ ,షాద్నగర్ ప్రెసిడెంట్ నవీన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాజేష్,సెక్రటరీ ఏ.యాదయ్య, శివకుమార్, ఏ.అమర్, టిడిఏ సభ్యులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.






# మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ రావు ఆశయాలను కొనసాగించాలి



## బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మార్చి 13:** తొర్రూర్ పాలకుర్తి నియోజకవర్గన్నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు, వైద్య సేవలు అందించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ రావు ఆశయాలను కొనసాగించాలనీ బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు కోరారు. శుక్రవారం తొర్రూర్ డివిజన్ కేంద్రం లోనీ విశ్రాంతి భవన్ లో డాక్టర్ ఎన్ ఎస్ రావు ట్రస్ట్ నిర్వాహకులు పల్లె యాకన్న గౌడ్ ఆధ్వర్యంలో డాక్టర్ సుధాకర్ రావు 2వ వర్ధంతినీ పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల లు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమన్నీ నిర్వహించారు.. కార్యక్రమానికి సహకరించిన ఎండీ అఫ్రోజు , మాజీ సర్పంచ్ రావుల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ విరమనేని యాకంత రావు, ల్యాబ్ అనిల్, డెకరేషన్ లక్ష్మణ్ లక్ష్మి నారాయణ, దామెర సరేష్..ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుర్ర శ్రీనివాస్ గౌడ్, రాయిశెట్టి వెంకన్న, లెగల వెంకట్ రెడ్డి, దంతాలపల్లి జనార్దన్, బత్తినీ అనిల్ గౌడ్, ఎండి మాలిక్ మురళీ, లాల్. తదితరులు పాల్గొన్నారు.



GMPS జిల్లా సహాయ కార్యదర్శిగా బొమ్మెరబోయిన

# శివకుమార్ యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మార్చి 13:** జనగామ జిల్లా గొర్రెల మేకల పెంపకందారుల సంఘం (GMPS) జిల్లా సహాయ కార్యదర్శిగా బొమ్మెరబోయిన శివకుమార్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో సంఘ సభ్యులందరి ఏకాభిప్రాయంతో ఆయనను ఈ పదవికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన సంఘం సభ్యులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని గొర్రెల మేకల పెంపకందారుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రతి సభ్యునికి అందుబాటులో ఉంటూ సంఘం బలోపేతానికి తనవంతు సేవలను అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. గొర్రెల పెంపకందారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తూ, వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఆయన ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా నామకరణ వేడుక

- హాజరైన తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో జర్నలిస్ట్ పస్తం సాంబ దంపతులు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో-తొర్రూరు ప్రతినిధి(సాంబ పస్తం),మార్చి13:** తొర్రూర్ పట్టణ కేంద్రంలో తూర్పాటి పున్నం వెంకన్న - పద్మ దంపతుల నివాసంలో వారి మనవడి (కుమార్తె స్వాతి కుమారుడు) నామకరణ మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. బంధుమిత్రుల కోలాహలం,మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు 'తొలి అక్షరం' దినపత్రిక రాష్ట్ర బ్యూరో-తొర్రూరు ప్రతినిధి,జర్నలిస్ట్ పస్తం సాంబ - లక్ష్మి దంపతులు హాజరయ్యారు. నామకరణం అనంతరం వారు చిన్నారికి ఆశీర్వచనాలు అందజేసి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పున్నం వెంకన్న కుటుంబ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో బంధుమిత్రులు పాల్గొని చిన్నారిని దీవించారు. తమ పిలుపును మన్నించి విచ్చేసిన జర్నలిస్ట్ పస్తం సాంబ దంపతులకు, ఇతర అతిథులకు వెంకన్న దంపతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పారిశుధ్యం పరిశుభ్రతతోనే - ఆరోగ్య భద్రత అంటున్న గిరాయ గుట్ట తండా సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్

- ప్రజా పాలనా 99 రోజుల ప్రణాళికను ముందుకు సాగిస్తున్న గ్రామస్తులు



**తొలి అక్షరం/షాద్ నగర్, మార్చి13:** ఫరూక్ నగర్ మండలం, గిరాయ గుట్ట తండా గ్రామ పంచాయతీలో ప్రజా పాలనా 99 రోజుల ప్రణాళిక లో భాగముగా తండలోని వివిధ కాలనీలోని రోడ్లన్నిటిని శుభ్రపరుస్తూ మన ఇంటి చుట్టూ ఆవరణలో మనమే శుభ్రపరుచుకోవాలి అని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్, ఉప సర్పంచ్ రాజు, కార్యదర్శి మల్లేష్, సి సి రామచంద్రయ్యా వార్డు సభ్యులు రాజు, మౌనిక రమేష్, సీనియర్ నాయకులు శ్రీను అంగన్వాడీ టీచర్ లక్ష్మమ్మ మరియు తదితరులు పాల్గొన్నారు.

# మత ఐక్యతకు ఇఫ్తార్ ప్రతీక.. 14వ వార్డులో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

- 14వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ అందమోహన్ ఇఫ్తార్ విందు..
- భారీగా హాజరైన ముస్లిం సోదరులు..





**తొలి అక్షరం/షాద్ నగర్, మార్చి13:** అన్ని మతాల ఐక్యతకు ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మ శుద్ధికి, క్రమశిక్షణకు, దైవారాధనకు రంజాన్ పవిత్ర మాసం ప్రత్యేకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాగే ఐక్యతతో అందరం కలిసి ఉండాలని, విద్వేషాలతో సాధించగలిగేది ఏమీ ఉండదని ఆయన పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, కౌన్సిలర్లు మురళీమోహన్ (అప్పి), బచ్చలి నరేష్, ముబారక్ అలీ ఖాన్, సర్వర్ పాషా, ఖదీర్, గంగ మౌని సత్తయ్య, శ్రీశైలం గౌడ్, అనిల్, మహేందర్, శ్రీకాంత్ ముదిరాజ్, భాష, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి వంశీ పాల్గొన్నారు.

# వన్డే వరల్డ్ కప్‌పై బీసీసీఐ స్పెషల్ ఫోకస్

**• ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లపై దృష్టి**



భారత క్రికెట్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉంది. వరుసగా రెండు టీ20 ప్రపంచకప్‌లు గెలవడంతో పాటు ఛాంపియన్స్ ట్రోఫీని కూడా ముద్దాడి వైట్ బాల్ క్రికెట్‌లో తిరుగులేని శక్తిగా ఎదిగింది. అయితే ఇన్ని విజయాలు ఉన్నప్పటికీ టీమ్‌ఇండియాకు ఒక వెలితి మాత్రం అలాగే ఉండిపోయింది. అదే 50 ఓవర్ల వన్డే వరల్డ్ కప్. 2011 తర్వాత భారత్ మళ్లీ ఆ ట్రోఫీని ముద్దాడలేదు. గత టోర్నీలో సొంత గడ్డపై ఫైనల్ వరకు వచ్చినా ఆస్ట్రేలియా చేతిలో ఎదురైన ఓటమి అభిమానులను ఇంకా వేధిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలోనే బీసీసీఐ ఇప్పుడు ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. 2027లో జరిగే వన్డే వరల్డ్ కప్ టార్గెట్‌గా ఇప్పటి నుంచే భారీ వ్యూహాలకు పదును పెడుతోంది. అందులో భాగంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల కోసం ఒక ప్రత్యేక ప్లాన్ సిద్ధం చేసింది. టీమ్‌ఇండియా దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లోనే ఆడుతున్నారు. 2027 వన్డే వరల్డ్ కప్ నాటికి వీరిద్దరూ పూర్తి ఫామ్‌లో ఉండాలని బీసీసీఐ భావిస్తోంది. అందుకే వారిద్దరికీ తగినంత ప్రాక్టీస్ లభించేలా రాబోయే విదేశీ పర్యటనల్లో అదనపు వన్డే మ్యాచులను షెడ్యూల్ చేయాలని నిర్ణయించింది. సాధారణంగా జరిగే మ్యాచుల కంటే ఎక్కువ వన్డేలు ఆడటం వల్ల ఈ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు మెగా టోర్నీకి మెరుగ్గా సిద్ధమవడానికి అవకాశం ఉంటుంది.ప్రస్తుతం అందరి దృష్టి ఐపీఎల్ 2026 సీజన్ పైనే ఉన్నప్పటికీ, మే నెలలో లీగ్ ముగిసిన వెంటనే టీమ్‌ఇండియా తన రూటు మార్చుకోనుంది. ఇప్పటివరకు టీ20లకు ఇచ్చిన ప్రాధాన్యతను ఇకపై వన్డే ఫార్మాట్‌కు మళ్లించనున్నారు. ఐపీఎల్ తర్వాత భారత జట్టు ఆఫ్ఘనిస్థాన్‌తో ఒక టెస్ట్, మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. దీని తర్వాత ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లి అక్కడ ఐదు టీ20లతో పాటు మూడు వన్డేలు ఆడేలా షెడ్యూల్ ఉంది. అయితే ఇంగ్లాండ్ పర్యటనలో కూడా మరిన్ని వన్డేలు చేర్చే అవకాశం కనిపిస్తోంది. భారత జట్టుతో సిరీస్ అంటే ఇతర దేశాల బోర్డులకు కూడా భారీ ఆదాయం వస్తుంది. అందుకే న్యూజిలాండ్, ఇంగ్లాండ్ వంటి బోర్డులు తమ పర్యటనల్లో అదనపు వన్డే మ్యాచులను చేర్చాలని బీసీసీఐని కోరుతున్నాయి. కివీస్ బోర్డు ఇప్పటికే మరిన్ని వన్డేల కోసం రిక్వెస్ట్ పంపగా, బీసీసీఐ కూడా సానుకూలంగా స్పందించింది. అలాగే శ్రీలంక, వెస్టిండీస్, బంగ్లాదేశ్ జట్లతో కూడా భారత్ పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడేలా ప్లాన్ చేస్తోంది. ఈ అదనపు మ్యాచులు ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా భారత జట్టుకు ఎంతగానో ఉపయోగపడతాయి. మరోవైపు విరాట్, రోహిత్ ఇప్పటికే తమ తదుపరి లక్ష్యంపై దృష్టి సారించారు. ఐపీఎల్ 2026 కోసం ప్రాక్టీస్ మొదలు పెట్టేశారు.



# కేకేఆర్ కెప్టెన్సీకి రహానే గుడ్ బై

ఐపీఎల్ 19వ సీజన్ ప్రారంభానికి సిద్ధమవుతున్న తరుణంలో సోషల్ మీడియాలో ఓ వార్త కోల్‌కతా నైట్ రైడర్స్ అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. టోర్నమెంట్ ప్రారంభానికి కేవలం 2 వారాల ముందు కెప్టెన్ అజింక్యా రహానే తన కెప్టెన్సీ నుంచి తప్పుకున్నారనే వార్త సోషల్ మీడియా దావానలంలా వ్యాపించింది. మార్చి 12, 2026 తేదీతో ఉన్న ఈ ప్రకటన నిజమేనని చాలా మంది నమ్మారు. అయితే లోతుగా విచారించగా ఈ వార్తలో ఎలాంటి నిజం లేదని తేలింది.సోషల్ మీడియాలో అజింక్యా రహానే ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ లాగా కనిపిస్తున్న ఓ స్క్రీన్ షాట్ వైరల్ అయ్యింది. అందులో "కొత్త నాయకుడిని తయారు చేసేందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నాను, అందుకే కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను" అని ఉంది. ఈ పోస్ట్ ప్రొఫెషనల్‌గా ఉండటంతో చాలా మంది దీనిని అధికారిక ప్రకటనగా భావించి షేర్ చేశారు. వైరలవుతున్న ఈ వార్తలపై లోతుగా విచారించగా.. ఇది పూర్తిగా అబద్ధమని తేలింది. అజింక్యా రహానే కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నట్లు తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ లేదా ఎక్స్ హ్యాండిల్స్‌లో ఎక్కడా ప్రకటించలేదు. అలాగే కేకేఆర్ జట్టు యాజమాన్యం కూడా దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. గతేడాది ముంబై డొమెస్టిక్ టీమ్ కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నప్పుడు అజింక్యా రహానే చేసిన పాత ప్రకటనను ఎవరో ఆకతాయిలు ఎడిట్ చేసి కేకేఆర్ పేరుతో వైరల్ చేశారు. 2024లో జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టిన శ్రేయస్ అయ్యర్ పంజాబ్ కింగ్స్‌కు వెళ్లిన తర్వాత కేకేఆర్ పగ్గాలను అజింక్యా రహానేకు అప్పగించారు. గత సీజన్ జట్టుకు అంతగా కలిసిరాకపోయినా.. కేకేఆర్ యాజమాన్యం అజింక్యా రహానే అనుభవంపైనే నమ్మకం ఉంచింది. ఐపీఎల్ 2026లో కూడా అజింక్యా రహానే కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టును ముందుండి నడిపించనున్నారు. మార్చి 29న వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్ జట్టుతో జరిగే మ్యాచ్‌తో కేకేఆర్ తన ఐపీఎల్ ప్రయాణాన్ని ప్రారంభించనుంది.

# నేడు కుల్దీప్ యాదవ్ పెళ్లి..



టీమిండియా స్టార్ క్రికెటర్ కుల్దీప్ యాదవ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతు న్నాడు. తన చిన్ననాటి స్నేహితురాలు వంశిక చద్దాను శనివారం పెళ్లి చేసుకోనున్నాడు. ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీలో వీరి వివాహం ఘనంగా జరగనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 విజయానంతరమే కుల్దీప్ యాదవ్ పెళ్లి వార్త అందరి దృష్టిని ఆకర్షించింది. అతని కాబోయే సతీమణి గురించి తెలుసుకోవడానికి నెటిజన్లు ఆసక్తి చూపుతున్నారు. వంశిక చద్దా, కుల్దీప్ యాదవ్ చిన్ననాటి స్నేహితులు. ఇద్దరూ కాన్పూర్‌కు చెందినవారే. పాఠశాల స్థాయి నుంచి ఈ ఇద్దరి మధ్య స్నేహం ఉన్నట్లు తెలుస్తోంది. కాన్పూర్‌లోని శ్యామ్ నగర్‌లో వంశిక కుటుంబం నివసిస్తుండగా.. కుల్దీప్ యాదవ్ కుటుంబం కాన్పూర్‌లోని లాల్ బంగ్లా ప్రాంతంలో ఉంటుంది. కాలక్రమేణా వీరి స్నేహం కాస్తా ప్రేమగా మారింది. అంతర్జాతీయ క్రికెట్‌లో కుల్దీప్ యాదవ్‌కు మంచి గుర్తింపు లభించినప్పటికీ, వంశిక మాత్రం బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా సాదాసీదా జీవితాన్నే గడుపుతున్నారు.వంశిక చద్దా.. భారత ప్రముఖ ఆర్థిక సంస్థ అయిన న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ)లో పనిచేస్తున్నారు. ఈ సంస్థలో మేనేజర్ లేదా అడ్మినిస్ట్రేటివ్ స్థాయిలో ఆమె పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. సెలబ్రిటీల సతీమణుల్లా కాకుండా.. వంశిక తనకంటూ ఒక ప్రత్యేకమైన వృత్తిని ఎంచుకున్నారు. ఆమె సోషల్ మీడియాకు దూరంగా ఉండటంతో పాటు బహిరంగ వేడుకల్లో కూడా చాలా అరుదుగా కనిపిస్తారు.కుల్దీప్ యాదవ్ క్రికెట్ విజయాల వల్ల నిరంతరం వార్తల్లో నిలుస్తుంటే.. వంశిక మాత్రం ప్రైవేట్ లైఫ్ గడపడానికే మొగ్గు చూపుతున్నారు.



# మరో 5 ఏళ్లు టీమిండియా జోలికి పోకండి..

టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన భారత జట్టుపై వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్ వివ్ రిచర్డ్స్ ప్రశంసలు కురిపించారు. వైట్ బాల్ క్రికెట్ అంటే వన్డేలు, టీ20ల్లో భారత్ ఆటను పూర్తిగా కొత్త స్థాయికి తీసుకెళ్లిందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత క్రికెట్ అభిమానుల ప్రేమ, అభిరుచి, ఆటపై ఉన్న ప్యాషన్ కారణంగానే టీమిండియా ఈ స్థాయికి ఎదిగిందని రిచర్డ్స్ పేర్కొన్నారు. భారతదేశంలో క్రికెట్‌కు అపారమైన అభిమానులు ఉన్నారని వివ్ రిచర్డ్స్ తెలిపారు. అభిమానుల మద్దతు, ఆటగాళ్ల అంకితభావం కలిసి టీమిండియాను ప్రపంచ క్రికెట్‌లో అగ్రస్థానానికి తీసుకెళ్లాయని ఆయన అభిప్రాయపడ్డారు. "క్రికెట్‌పై భారత అభిమానులు చూపించే ప్రేమ, ఉత్సాహం అసాధారణం. అందుకే ఈ విజయాలు వారికి సరైన బహుమతిలాంటివి" అని రిచర్డ్స్ అన్నారు.ప్రస్తుతం వివ్ రిచర్డ్స్ కామన్‌వెల్త్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ మీటింగ్ అధికారిక ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.

# యువరాజ్ సింగ్ దగ్గర పంత్ స్పెషల్ క్లాసులు!



ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభానికి సమయం దగ్గరపడుతున్న తరుణంలో టీమిండియా స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ తన ఆటను సరికొత్తగా తీర్చిదిద్దుకునే పనిలో పడ్డాడు. గత సీజన్లలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన రిషబ్ పంత్.. ఈ సారి ఎలాగైనా అద్భుతమైన రీఎంట్రీ చేయాలని పట్టుదలతో ఉన్నాడు. ఇందులో భాగంగా భారత క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ వైట్-బాల్ ప్లేయర్లలో ఒకడైన యువరాజ్ సింగ్‌ను మెంటార్‌గా ఎంచుకుని.. ముంబై వేదికగా కఠినమైన శిక్షణను పూర్తి చేశారు. ముంబైలోని చారిత్రాత్మక బ్రబౌర్న్ స్టేడియంలో దాదాపు 4 రోజుల పాటు ఈ ప్రత్యేక శిక్షణా శిబిరం జరిగింది. ఈ సెషన్లలో రిషబ్ పంత్ కేవలం బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడమే కాకుండా యువీ నుంచి విలువైన సలహాలను స్వీకరించారు. ముఖ్యంగా వైట్-బాల్ క్రికెట్‌లో తన పవర్ హిట్టింగ్‌ను మెరుగుపరుచుకోవడంపై రిషబ్ పంత్ దృష్టి పెట్టాడు. ఫీల్డింగ్ పరిమితులను అనుకూలంగా మార్చుకుంటూ కొత్త రకమైన షాట్లను ప్రయోగించడం.. ఒత్తిడి సమయంలో వికెట్ కాపాడుకుంటూనే పరుగులు రాబట్టడం వంటి అంశాలపై యువరాజ్ సింగ్ శిక్షణ ఇచ్చాడు. మ్యాచ్ పరిస్థితులను ప్రతిబింబించేలా డే అండ్ నైట్ ఈ ప్రాక్టీస్ సెషన్లు నిర్వహించడం విశేషం. యువరాజ్ సింగ్‌కు యు ప్లేయర్లను అద్భుతమైన ఫామ్‌లోకి తీసుకురావడంలో మంచి ట్రాక్ రికార్డు ఉంది. గతంలో అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ వంటి యువ కెరటాలు యువీ గైడెన్స్‌లోనే ప్రపంచ స్థాయి బ్యాటర్లుగా ఎదిగారు. అదే విధంగా గతంలో సంజూ శాంసన్ కూడా యువరాజ్ వద్ద శిక్షణ పొందాడు. ఇప్పుడు రిషబ్ పంత్ కూడా అదే బాటలో పయనిస్తూ.. తనలో ఉన్న పాత దూకుడును తిరిగి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆగస్టు 2024 తర్వాత రిషబ్ పంత్ భారత్ తరఫున పరిమిత ఓవర్ల క్రికెట్లో పెద్దగా కనిపించలేదు.. కాబట్టి ఈ ఐపీఎల్ సీజన్ అతని కెరీర్‌కు ఎంతో కీలకం కానుంది. ముంబైలో తన వ్యక్తిగత శిక్షణ ముగించుకున్న వెంటనే రిషబ్ పంత్ నేరుగా చెన్నైకి చేరుకున్నాడు. అక్కడ లక్నో సూపర్ జెయింట్స్ జట్టు నిర్వహిస్తున్న ప్రీ-సీజన్ క్యాంపులో రిషబ్ పంత్ చేరాడు. ఈ క్యాంపు సీనియర్ కోచ్‌లు భరత్ అరుణ్, లాన్స్ క్లూజనర్ పర్యవేక్షణలో జరుగుతోంది. ఇక్కడ రిషబ్ పంత్ తన జట్టు సభ్యులైన ఆయుష్ బదోని, మయాంక్ యాదవ్ వంటి వారితో కలిసి వ్యూహాలను సిద్ధం చేస్తున్నారు.



# గిల్ పోస్ట్‌పై అభిమానుల ఆగ్రహం..

టీమిండియా మరోసారి ప్రపంచ క్రికెట్‌లో చరిత్ర సృష్టించింది. ఐసీసీ మెన్స్ టీ20 ప్రపంచకప్ 2026 లో భారత్ టైటిల్‌ను విజయవంతంగా కాపాడుకున్న తొలి జట్టుగా నిలిచింది. మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్రం మోడీ స్టేడియంలో లో జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్ ( పై భారత్ 96 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో స్వదేశంలోనే వరల్డ్ కప్ గెలిచిన తొలి జట్టుగా కూడా భారత్ రికార్డు సృష్టించింది. ఈ విజయానికి హీరోగా సంజూ శాంసన్ నిలిచాడు. కేరళకు చెందిన ఈ వికెట్‌కీపర్ బ్యాటర్ అద్భుత ప్రదర్శనతో టోర్నమెంట్ మొత్తం ఆకట్టుకున్నాడు. వెస్టిండీస్‌పై జరిగిన కీలక మ్యాచ్‌లో అజేయంగా 97 పరుగులు చేసి జట్టుకు విజయం అందించాడు. అనంతరం ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో 89 పరుగులు, అలాగే న్యూజిలాండ్‌పై ఫైనల్‌లో కూడా 89 పరుగులు చేసి భారత్ టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ అద్భుత ప్రదర్శనకు గుర్తింపుగా అతనికి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు కూడా లభించింది. ఇంతటి ప్రదర్శన చేసిన సంజూ శాంసన్ ఇప్పుడు మరో కారణంతో వార్తల్లో నిలిచాడు. భారత బ్యాటర్ శుభ్మన్ గిల్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక ఫోటో వివాదానికి దారితీసింది. వరల్డ్ కప్ గెలిచిన తర్వాత ట్రోఫీతో ఉన్న జట్టు ఫోటోను గిల్ ఛాంపియన్స్ అనే క్యాప్షన్‌తో షేర్ చేశాడు. అయితే ఆ ఫోటోలో సంజూ సాంసన్ కనిపించకపోవడంతో అభిమానులు తీవ్రంగా స్పందించారు. టోర్నమెంట్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఆటగాడిని ఫోటోలో చూపకపోవడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కొందరు అభిమానులు గిల్‌పై అసూయ ఆరోపణలు కూడా చేశారు.ఇంకా కొందరు అభిమానులు మరో అంశాన్ని కూడా ప్రస్తావించారు. అదే రోజున సూర్యకుమార్ యాదవ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫోటోలో సంజూ శాంసన్ కొంతవరకు కనిపిస్తున్నట్లు చెప్పారు. దీంతో గిల్ షేర్ చేసిన ఫోటోలో శాంసన్‌ను ఎడిట్ చేసి తొలగించారా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ విషయంపై సోషల్ మీడియాలో పెద్ద చర్చ కొనసాగుతోంది. ఈ టోర్నమెంట్‌కు ముందు భారత జట్టు ఎంపిక సమయంలో కూడా ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రధాన ఎంపికదారు అజిత్ అగార్కర్ , హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ( గిల్ ఎంపికకు మద్దతు ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి.అయితే, ఇతర సెలెక్టర్లు వేగంగా ఆడగల ఆటగాళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. మొదటి బంతి నుంచే దూకుడుగా ఆడగల ఇషాన్ కిషన్ , సంజూ శాంసన్‌లను ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో గిల్‌కు ఈసారి వరల్డ్ కప్ జట్టులో చోటు దక్కలేదు. అయితే ఈ నిర్ణయం జట్టులో "నో సూపర్ స్టార్" సంస్కృతిని బలపరిచిందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

ఘనంగా ప్రారంభమైన అల్లు సినిమాస్...

# వివాదంలో 'వాల్ ఆఫ్ గ్రేట్స్'



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, ఏషియన్ సినిమాస్‌తో కలిసి నిర్మించిన 'అల్లు సినిమాస్' మల్టీప్లెక్స్ నిన్న హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. సీఎం రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై థియేటర్‌ను ప్రారంభించారు. హైదరాబాద్‌లో తొలి, దేశంలోనే అతిపెద్ద డాల్బీ సినిమాగా ప్రచారం పొందుతున్న ఈ థియేటర్ ప్రారంభోత్సవం ఒకవైపు అభినందనలు అందుకుంటుండగా, మరోవైపు ఒక కొత్త వివాదానికి కేంద్ర బిందువుగా మారింది.

థియేటర్ లోపల భారతీయ సినిమాకు చెందిన గొప్ప దర్శకులకు నివాళిగా 'వాల్ ఆఫ్ గ్రేట్స్' పేరుతో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీ ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ గోడపై ఎస్.ఎస్. రాజమౌళి, సుకుమార్, త్రివిక్రమ్ శ్రీనివాస్, మణిరత్నం, వెట్రిమారన్, ప్రశాంత్ నీల్, రాజ్‌కుమార్ హిరానీ, సంజయ్ లీలా భన్సాలీ, సందీప్ రెడ్డి వంగా వంటి దర్శకుల చిత్రాలను ప్రదర్శించారు. అయితే, ఈ జాబితాలో కొందరు దిగ్గజ దర్శకుల ఫొటోలు లేకపోవడం తీవ్ర విమర్శలకు కారణమైంది.

భారతీయ కమర్షియల్ సినిమా రూపురేఖలు మార్చిన శంకర్, రామ్ గోపాల్ వర్మ వంటి దర్శకులను విస్మరించడంపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా, తెలుగు సినిమా గతిని మార్చిన లెజెండరీ దర్శకులైన కె.వి. రెడ్డి, కళాతపస్వి కె. విశ్వనాథ్, దర్శకరత్న దాసరి నారాయణరావు, దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు, జంధ్యాల, సింగీతం శ్రీనివాసరావు, కోదండరామిరెడ్డి వంటి వారిని ఈ గౌరవానికి ఎంపిక చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అలాగే, పూరి జగన్నాథ్, శ్రీను వైట్ల వంటి ఆధునిక కమర్షియల్ దర్శకులను కూడా పరిగణనలోకి తీసుకోకపోవడం చర్చనీయాంశమైంది.

ప్రస్తుతం అల్లు అర్జున్‌తో సినిమా చేస్తున్న దర్శకుడు అట్లీ ఫొటో ఈ జాబితాలో ఉండటంతో ఈ వివాదం మరింత ముదిరింది. అల్లు అర్జున్ కేవలం తనకు నచ్చిన, తనతో పనిచేసిన దర్శకులకే ప్రాధాన్యత ఇచ్చారని, ఇది పక్షపాతంతో కూడిన ఎంపిక అని పలువురు సోషల్ మీడియాలో ఆరోపిస్తున్నారు. "ఆర్జీవీ లేకుండా భారతీయ సినిమా చరిత్ర ఎలా పూర్తవుతుంది?", "విశ్వనాథ్, దాసరి, రాఘవేంద్రరావుల వంటి మహామహుల సంగతేంటి?" అంటూ నెటిజన్లు ప్రశ్నలు సంధిస్తున్నారు.

# 'సూపర్ వెల్లి'...

## కొత్త జానర్ ట్రై చేస్తున్న ఆదా శర్మ



'ది కేరళ స్టోరీ' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటి అదా శర్మ, ఇప్పుడు ఓ సూపర్ ఉమన్ గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ కొత్త చిత్రానికి 'సూపర్ వెల్లి' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు రాజేష్ బచ్చాని దర్శకత్వం వహిస్తున్నారు.ఈ చిత్రంలో అదా శర్మ పాత్ర చాలా భిన్నంగా ఉండనుంది. ప్రపంచాన్ని కాపాడే సూపర్ హీరోలా కాకుండా, తన శక్తులతో ప్రపంచాన్ని నాశనం చేయాలనుకునే సోమరి, గందరగోళ స్వభావం ఉన్న పాత్రలో ఆమె కనిపించనున్నారు. ఇటీవలే విడుదలైన టీజర్‌లో కూడా, ప్రపంచాన్ని రక్షించడం కంటే నిద్రపోవడానికే ఇష్టపడే పాత్రగా ఆమెను చూపించారు.దర్శకుడు రాజేష్ బచ్చాని మాట్లాడుతూ.. "కమాండో సినిమాలో అదా చేసిన భావనా రెడ్డి పాత్ర నాకు గుర్తుంది. ఆమెలోని సహజమైన ప్రతిభ, చురుకుదనం, హాస్యం చూశాక మా 'సూపర్ వెల్లి' పాత్రకు ఆమే సరైన ఎంపిక అనిపించింది. మూడేళ్లుగా ఈ స్క్రిప్ట్‌పై పనిచేస్తున్నాను. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాం" అని తెలిపారు.

:

# పవన్ ఫ్యాన్స్‌కు కొత్త అనుభూతి...

## డాల్బీ సినిమా ఫార్మాట్‌లో 'ఉస్తాద్ భగత్ సింగ్'


పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం సరికొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమైంది. ఈ సినిమాను అత్యుత్తమ సాంకేతికత అయిన డాల్బీ సినిమా (ఐశీశ్రీఎఎ జఱఅవమ్ఖ) ఫార్మాట్‌లో విడుదల చేస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ నెల 19న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు.గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత పవన్ కల్యాణ్, డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో పవన్ కల్యాణ్ సరసన శ్రీలీల, రాశీఖన్నా హీరోయిన్లుగా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. పవన్ కల్యాణ్‌ను ఇంతకుముందెన్నడూ చూడని అత్యుత్తమ ఫార్మాట్‌లో, డాల్బీ స్క్రీన్స్‌పై చూడటం అభిమానులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని మేకర్స్ తెలిపారు.

సాధారణ థియేటర్ల కంటే డాల్బీ సినిమా ఫార్మాట్‌లో దృశ్య, శబ్ద నాణ్యత అత్యంత సహజంగా, అద్భుతంగా ఉంటుంది. ఈ సాంకేతికతతో ఉస్తాద్ భగత్ సింగ్ రానుండటంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రంలో నటుడు ఆర్.పార్థిబన్ కీలక పాత్ర పోషించగా, సినిమాటోగ్రాఫర్‌గా బోస్, ఆర్ట్ డైరెక్టర్‌గా ఆనంద్ సాయి పనిచేశారు. పండుగ కానుకగా కేవలం వారం రోజుల వ్యవధిలోనే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో అభిమానులు సంబరాలకు సిద్ధమవుతున్నారు.




చరణ్ బర్త్‌డే స్పెషల్..

# ఫ్యాన్స్‌కు డబుల్ ధమాకా!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు ఒకేసారి రెండు పండగ లాంటి వార్తలు అందే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల 27న చరణ్ బర్త్‌డే కానుకగా ఆయన నటిస్తున్న రెండు ప్రతిష్ఠాత్మక చిత్రాల నుంచి కీలక అప్‌డేట్స్ రానున్నట్లు టాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

బ్లాక్‌బస్టర్ చిత్రం 'రంగస్థలం' తర్వాత రామ్ చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో 'RC17' తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఇటీవల 'పుష్ప 2'తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సుకుమార్, ఈ సినిమాపై ప్రత్యేక దృష్టి సారించారు. చరణ్ పుట్టినరోజున ఈ చిత్రానికి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌తో పాటు షూటింగ్ ప్రారంభ తేదీని కూడా ప్రకటించవచ్చని సమాచారం. ఈ అప్‌డేట్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మరోవైపు బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్ చరణ్ నటిస్తున్న పీరియడ్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' షూటింగ్ చివరి దశలో ఉంది. ఏప్రిల్ 30న ఈ సినిమా విడుదల కానుండటంతో ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగా చరణ్ పుట్టినరోజున 'పెద్ది' టీజర్‌ను విడుదల చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలకు మంచి స్పందన రావడంతో టీజర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఒకవేళ ప్రచారం జరుగుతున్నట్లుగా ఒకే రోజు 'RC17' అప్‌డేట్, 'పెద్ది' టీజర్ విడుదలైతే మార్చి 27న రామ్ చరణ్ అభిమానులకు నిజంగా డబుల్ ధమాకానే అని చెప్పాలి. ఈ రెండు సర్‌ప్రైజ్‌ల కోసం మెగా ఫ్యాన్స్ ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.



# పిల్లల్ని కనడంపై వరలక్ష్మి శరత్ కుమార్ వివాదాస్పద వ్యాఖ్యలు

నటి వరలక్ష్మి శరత్‌కుమార్ ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. జనాభా నియంత్రణకు, ఆర్థిక స్థోమతను పిల్లలను కనడానికి ముడిపెడుతూ ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

"మన దేశంలో సెక్స్ గురించి ఎవరూ మాట్లాడరు కానీ, జనాభాలో మాత్రం మనం ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్నాం. పిల్లలను ఒక ఫ్యాక్టరీలా కనేస్తున్నారు, ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయని బాధపడతారు. కనే ముందే సరైన ప్లాన్ ఉండాలి కదా" అని ఆమె ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో ఒక బిడ్డను పెంచి, చదివించడం చాలా ఖర్చుతో కూడుకున్న పని అని, అందుకే ఇంకొకరిని పోషించే స్తోమత ఉన్నప్పుడే పిల్లలను కనాలని ఆమె సూచించారు.

చాలామంది తమ పిల్లల చదువుల కోసం లేదా ఆర్థిక సాయం కోసం తన దగ్గరకు వస్తుంటారని చెప్పిన వరలక్ష్మి... "ఆ పిల్లలకు నేనేమైనా జన్మనిచ్చానా? మీ తప్పులకు నేను ఎందుకు బాధ్యత వహించాలి?" అని ప్రశ్నించారు. ఈ విషయంలో ఆమెకు ప్రియమణి, మంచు లక్ష్మి కూడా మద్దతుగా నిలిచారు.

మద్దతుగా: "ఆమె చెప్పింది కఠినమైన నిజం. బాధ్యత లేకుండా పిల్లలను కని వారిని ఇబ్బందుల్లోకి నెట్టడం కంటే, ప్లానింగ్ ఉండటం మంచిది" అని కొందరు నెటిజన్లు ఆమెను సమర్థిస్తున్నారు.

వ్యతిరేకంగా: "డబ్బు ఉన్న వారే పిల్లలను కనాలనడం అహంకారం. 40 ఏళ్లలో సెటిల్ అయ్యాక పిల్లలు పుడతారన్న గ్యారెంటీ ఏంటి?" అని కొందరు ప్రశ్నిస్తున్నారు. పేదవారికి పిల్లలను కనే హక్కు లేదా అంటూ ఆమె వ్యాఖ్యలను మరికొందరు తప్పుబడుతున్నారు.

# అదే విధానం కొనసాగించాలి

**: సినిమా టిక్కెట్ ధరల పెంపు వ్యవహారంలో సుప్రీంకోర్టు స్టే**

సినిమా టిక్కెట్ ధరలపై ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ప్రస్తుతానికి టిక్కెట్ ధరల పెంపుపై ఇప్పటి వరకు అనుసరిస్తున్న విధానాన్ని కొనసాగించాలని సుప్రీంకోర్టు సూచించింది.

సినిమా టిక్కెట్ ధరల పెంపుపై ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. టిక్కెట్ రేట్లు పెంచాలంటే చిత్రం విడుదలకు 90 రోజుల ముందే ప్రభుత్వం జీవో జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది.ఈ నేపథ్యంలో మైత్రీ మూవీ మేకర్స్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై శుక్రవారం విచారణ జరగగా జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. టిక్కెట్ ధరల పెంపుపై ఎప్పుడూ అనుసరించే విధానాన్నే కొనసాగించాలని సూచించింది.

